# నినాదం

నిఖార్సైన జర్నలిజం

ఆదివారం 8 ఫిబ్రవరి 2026 | సంపుటి: 22 | సంచిక: 135 | వెల: రూ.7 | పేజీలు: 12+12

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam


## ఎస్‌పిఎఫ్ సిబ్బందికి భారీ శుభవార్త

**ఉద్యోగులకు అధిక బీమా రక్షణతో పాటు కుటుంబానికి భద్రత**




*తెలంగాణ ప్రత్యేక రక్షణ దళం (ఎస్ పిఎఫ్) సిబ్బంది సంక్షేమం కోసం కీలక అడుగు పడింది. ఎస్ పిఎఫ్ మరియు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) మధ్య ప్రత్యేక జీత ప్యాకేజ్‌కు సంబంధించి అవగాహన ఒప్పందం కుదిరింది. సికింద్రాబాద్‌లోని ఎస్‌పిఎఫ్ ప్రధాన కార్యాలయంలో ఈ ఒప్పందాన్ని అమలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా ఎస్‌పిఎఫ్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు అధిక బీమా రక్షణతో పాటు కుటుంబానికి భద్రత కలగనుంది.*

***- హైదరాబాద్, ఫిబ్రవరి 7(నినాదం)***

2

# మున్సిపల్ ఎన్నికల్లో విజయం మాదే

**మరో మూడేళ్లు అధికారంలో ఉండేది మేమే**

**అభివృద్ధి చేస్తున్నాం.. ఇంకా చేసి చూపిస్తాం**

- వికారాబాద్, పరిగి, తాండూర్‌లకు గోదావరి నీళ్లు పారిస్తాం
- కేసీఆర్ కట్టిన కాళేశ్వరం మూడేళ్లకే కూలేశ్వరంగా మారింది
- దళితుడిని సిఎం చేస్తానని మోసం చేసిన చరిత్ర దాగదు
- బిజెపి, బిఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలను తిప్పికొట్టండి
- వికారాబాద్ జిల్లా పర్యటనలో సీఎం రేవంత్ పిలుపు



**తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో గెలిచేది మళ్లీ కాంగ్రెస్ పార్టీయేనని సిఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మీరిచ్చిన అధికారంతో అభివృద్ధి పనులు చేస్తున్నామని అంటూ..వికారాబాద్, తండూర్, పరిగి ప్రాంతాలకు గోదావరి జలాలను తరలిస్తామని అన్నారు. ఇందుకు మంత్రి శ్రీధర్ బాబే సాక్ష్యం అంటూ హామీ ఇచ్చారు.**

**- హైదరాబాద్,ఫిబ్రవరి 7(నినాదం)**

వికారాబాద్ జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా నారాయణ పూర్‌లో నిర్వహించిన ప్రజాపాలన–ప్రగతిబాట బహిరంగ సభ పాల్గొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మంజూరైన ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును కేసీఆర్ తన స్వార్థం కోసం అటకెక్కించారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. రంగారెడ్డి జిల్లాకు 3 టీఎంసీల గోదావరి జలాలను అందిస్తే లక్షలాది ఎకరాలు సాగులోకి వచ్చేవేనని, కానీ కేసీఆర్ నిర్లక్ష్యం వల్ల జిల్లా రైతాంగం బలైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ లక్ష కోట్లు వెచ్చించి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం మూడు ఏళ్లలోనే 'కూలేశ్వరం'గా మారిందని, ఆ ప్రాజెక్టు నిధులతో ఆయన కుటుంబ సభ్యులు ఫామ్ హౌసులు కట్టుకుని వ్యాపారాలు చేసుకున్నారని ఆరోపించారు. తాండూరు, పరిగి , వికారాబాద్ ప్రాంతాలను గోదావరి జలాలతో సస్యశ్యామలం చేసే బాధ్యతను తమ ప్రభుత్వం

2

> **"తెలంగాణ ఉద్యమనాయకుడని చెప్పకునే కేసీఆర్.. రంగారెడ్డి జిల్లాకు గోదావరి జలాలను ఎందుకు అడ్డుకున్నారు. కేసీఆర్ మనోడు కాదు. పరాయి వాడు. పక్క రాష్ట్రం గురించే ఆలోచిస్తారు. రోజమ్మ చేపల పులుసు తిని రాయలసీమను రతనాల సీమ చేస్తానని కేసీఆర్ చెప్పారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు కట్టేందుకు ప్రణాళికలు పూర్తి చేస్తాం. కేసీఆర్ కట్టిన కాళేశ్వరం మూడేళ్లలో కూలేశ్వరం అయ్యింది. గోదావరి జలాలను తీసుకొచ్చి తాండూరు, పరిగి, వికారాబాద్, చేవెళ్లను సస్యశ్యామలం చేస్తాం."**
>
> **- రేవంత్ రెడ్డి, సీఎం**



## గెలిపించే బాధ్యత మీది అభివృద్ధి బాధ్యత మాది

పనులు చేయని గులాబీ రంగు కాంట్రాక్టర్లను ఇంటికి పంపిస్తాం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్,ఫిబ్రవరి 7(నినాదం)**

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ దాని మిత్రపక్ష పార్టీ అభ్యర్థులను గెలిపించే బాధ్యత ప్రజలు తీసుకోవాలని, మీ ప్రాంత అభివృద్ధి, మీ సంక్షేమం బాధ్యతను తాము తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్ ఇన్‌ఛార్జి మంత్రిగా శనివారం నాడు మహబూబాబాద్ జిల్లా తొర్రూరు, వరంగల్ జిల్లా వర్ధన్నపేట, జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్, జనగామ మున్సిపాల్టీల పరిధిలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆయా మున్సిపాల్టీల పరిధిలో నిర్వహించిన ప్రచారంలో మంత్రి మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఇండ్లు మంజూరు చేశారని మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వమే ఇండ్లు మంజూరు చేస్తోందని అన్నారు. రెవెన్యూ మంత్రిగా అర్హులైన పేదలకు స్థలాలు మంజూరు చేసి

**...మిగతా 2లో**



## జమ్మికుంట వ్యాపారులకు.. సర్కారు అండ

బెదిరిస్తే భయపడే ప్రసక్తి లేదు

2

మున్సిపాలిటీల అభివృద్ధి మా బాధ్యత

మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్

బెదిరిస్తే భయపడే సర్కారు రేవంత్ సర్కార్ కాదని, బెదిరించే వాడిని ఏం చేయాలో ప్రభుత్వానికి తెలుసునని, మౌనంగా ఉన్న సర్కారు పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఎంతటి వాడికైనా అధోగతి తప్పదని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

**– జమ్మికుంట, ఫిబ్రవరి 7 (నినాదం)**




## మలేసియాలో త్వరలో కొత్త కాన్సులేట్ ఏర్పాటు

**కౌలాలంపూర్‌లో ప్రధాని మోడీ ప్రకటన**

**ఘనంగా స్వాగతం పలికిన ప్రవాస భారతీయులు**

**కౌలాలంపూర్,ఫిబ్రవరి 7(నినాదం):** మలేసియాలో త్వరలో కొత్త కాన్సులేట్ ఏర్పాటు చేయనున్నట్టు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. రెండ్రోజుల మలేసియా పర్యటన నిమత్తం శనివారంనాడు కౌలాలంపూర్ చేరుకున్న ఆయనకు మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం సాదర స్వాగతం పలికారు. భారతీయ సంప్రదాయ నృత్యాలతో ప్రవాస భారతీయులు ఆహ్వానం పలికారు. అనంతరం కౌలాలంపూర్‌లోని భారత సంతతి ప్రజలతో ఆత్మీయ సమ్మేళనంలో మోదీ పాల్గొన్నారు. భారత్ పదేళ్లలో వేగంగా సాధిస్తున్న ప్రగతిని ఈ సందర్భంగా మోదీ వివరిస్తూ, పదేళ్ల క్రితం 11వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారతదేశం ప్రస్తుతం

**...మిగతా 2లో**

## ఆధిపత్య పోరు కావాలా.. అభివృద్ధి కావాలా

తూప్రాన్‌లో నేతల గొడవలతో అభివృద్ధి వెనక్కి

మున్సిపల్ ప్రచారంలో హరీష్ రావు విమర్శలు





**తూప్రాన్‌లో కాంగ్రెస్ నాయకుల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోందని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు అన్నారు. నర్సారెడ్డి, మైనంపల్లి మధ్య ఆధిపత్యం కోసం ప్రజలను బలి చేస్తున్నారని మండిపడ్డారు. మీకు ఆధిపత్య రాజకీయాలు కావాలా లేక అభివృద్ధి కావాలా ఆలోచించండని ప్రజలకు సూచించారు.**

**గజ్వేల్, ఫిబ్రవరి7 (నినాదం)**

2

## దేశ సాంకేతిక రంగంలో మలుపురాయి

**అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ టెక్నాలజీ**

**50 ఎకరాల్లో కార్యాలయాలకు శంకుస్థాపన**



**అమరావతి,ఫిబ్రవరి 7(నినాదం):** దేశ భవిష్యత్తు సాంకేతిక రంగాన్ని మలుపు తిప్పే చరిత్రాత్మక ఘట్టానికి అమరావతి వేదిక అయ్యింది. ప్రపంచ క్వాంటమ్ టెక్నాలజీ రంగంలో ఏపీని అగ్రగామిగా నిలిపే లక్ష్యంతో రూపొందించిన 'అమరావతి క్వాంటమ్ వ్యాలీ' భవన నిర్మాణానికి శనివారం పునాదిరాయి పడింది.

2

## ముంబై మేయర్ పదవి బీజేపీకే

బిజెపి మేయర్ అభ్యర్థిగా రితూ తావ్డే డిప్యూటి మేయర్‌గా శివసేన కార్పొరేటర్ సంజరు శంకర్ ఘాడి

6

## క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ దేశానికి గేమ్ ఛేంజర్



**ఆనాడు హైటెక్ సిటీతో టెక్నాలజీ రంగంలో పెనుమార్పులు**

**ఇప్పుడు ప్రపంచానికి దిక్సూచిగా అమరావతి క్వాంటమ్: సీఎం చంద్రబాబు**

2

## మావోయిస్టులకు ఎదురుదెబ్బ

**బస్తర్ జిల్లాలో లొంగిపోయిన 51 మంది మావోలు**



**రాయపూర్,ఫిబ్రవరి 7(నినాదం):** మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్ జిల్లా బస్తర్ డివిజన్‌లో 51 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిపై రూ.1.61 కోట్ల రివార్డు ఉంది. వీరంతా బస్తర్ ఎస్పీ జితేందర్ యాదవ్ సమక్షంలో శనివారంనాడు లొంగిపోయారు.

2

## ఫోరెన్సిక్ ల్యాబ్‌లో భారీ అగ్ని ప్రమాదం

**మొదటి అంతస్తులో చెలరేగిన మంటలు**

**మంటల్లో కీలక పత్రాలు, కంప్యూటర్లు అగ్నికి ఆహుతి**

హైదరాబాద్ నగరంలోని నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఫోరెన్సిక ల్యాబ్‌లో శనివారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ల్యాబ్ భవనం మొదటి అంతస్తులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో దట్టమైన పొగ అలుముకుంది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులు ఘటనాస్థలికి చేరుకుని, ఐదు ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపుచేసారు.

**- హైదరాబాద్,ఫిబ్రవరి 7(నినాదం)**




2



## ప్రమాదంపై అనుమానాలు

**ఓటుకు నోటు ఆధారాలు తగులబెట్టారు: కేటిఆర్**

హైదరాబాద్,ఫిబ్రవరి 7(నినాదం): హైదరాబాద్ నాంపల్లిలోని ఫోరెన్సిక సైన్స్ ల్యాబ్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అనుమానాలు వ్యక్తం చేశారు. ఓటుకు నోటు కేసుకు సంబంధించిన వాయిస్ రికార్డింగ్‌లను, ఫోన్ ట్యాపింగ్ కేసులో కాంగ్రెస్ ప్రభుత్వం పుట్టించిన తప్పుడు ఆధారాలను కప్పిపుచ్చడానికి చేసిన ప్రయత్నంగా కనిపిస్తుందని సందేహం వ్యక్తంచేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కేటీఆర్ స్పందించారు.



# జమ్మికుంట వ్యాపారులకు.. సర్కారు అండ

మొదటి పేజీ తరువాయి

జమ్మికుంట పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో కౌన్సిలర్ అభ్యర్థులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మంత్రులు మాట్లాడుతూ స్థానికంగా ఉన్న నాయకులకు గాని వ్యాపారులకు గాని బెదిరింపులు వచ్చినట్లయితే వారికి అండగా రేవంత్ సర్కార్ ఉంటుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. జమ్మికుంట, హుజురాబాద్ మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలని మున్సిపాలిటీల అభివృద్ధి మా బాధ్యతగా తీసుకొని ముఖ్యమంత్రి నుండి నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. గతంలో లాగా మాయ మాటలు చెప్పి దౌర్జన్యాలు చేసి అక్రమ వసూళ్లకు పాల్పడే వ్యవస్థ లేదని అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు నడుస్తుందని వెల్లడించారు. గతంలో నేతనుల కోసం చేసిన బాకీలను సైతం రేవంత్ సర్కార్ చెల్లించడం జరుగుతుందని రైతన్నలకు దీటుగా నేతన్నలకు దీటుగా 48 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వ ముందుకు పోతుందని గత ప్రభుత్వ పాలకులు ఎన్ని నిందలు అపవాదులు వేసినప్పటికీ పట్టించుకోకుండా ప్రజా సంక్షేమమే ముఖ్యంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హుజురాబాద్ జమ్మికుంట మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండా ఎగురవేసేలా ప్రతీ కార్యకర్త శక్తివంతన లేకుండా ఈ మూడు రోజులపాటు కృషి చేయాలని ఆదేశించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గతంలో పార్లమెంట్ సభ్యునిగా ఉన్నప్పుడు ఇల్లంతకుంట రామాలయంతో పాటు జమ్మికుంట పట్టణంలోని రైల్వే స్టేషన్ ను అభివృద్ధి చేయడం జరిగిందని, ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భవిష్యత్తులో కార్యకర్తలకు మంచి పదవులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ ఇన్చార్జులు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ సి ఎన్ రెడ్డి, హుజురాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి ప్రణవ్ బాబు, పత్తి కృష్ణారెడ్డి, అరకాల వీరేశలింగం తో పాటు కౌన్సిలర్ అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టులకు ఎదురుదెబ్బ

మొదటి పేజీ తరువాయి

బస్తర్ జిల్లా ప్రధాన కార్యాలయమైన జగదల్‌పూర్‌లో బస్తర్ పాండుమ్ 2026 ఫెస్టివల్ ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర మంత్రి అమిత్‌షా రాయపూర్ వచ్చిన రోజునే ఇంత పెద్దసంఖ్యలో మావోయిస్టులు లొంగిపోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. బీజాపూర్ జిల్లాలో 20 మంది మహిళా క్యాడర్‌తో సహా 30 మంది మావోయిస్టులు లొంగిపోయారని, మరో 21 మంది సుక్మా జిల్లాలో లొంగిపోయారని ఎస్పీ సుందరరాజ్ తెలిపారు. వీరిలో 14 మంది మహిళా క్యాడర్ ఉన్నారని చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టుల నుంచి వైర్‌లు, జెలటిన్ స్టిక్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. లొంగిపోయిన ప్రతి మావోయిస్టుకు 50 వేల తక్షణ ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పునరావాస చర్యలతో స్వచ్ఛందంగా వీరంతా లొంగిపోయినట్లు చెప్పారు. కాగా, తక్కిన మావోయిస్టు క్యాడర్ కూడా హింసను విడనాడి జనజీవన స్రవంతిలో కలవాలని, వారికి భద్రత, గౌరవంగా జీవించేందుకు అవసరమైన పునరావసం కల్పిస్తామని సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ కోరారు.

# ఫోరెన్సిక్ ల్యాబ్‌లో భారీ అగ్ని ప్రమాదం

మొదటి పేజీ తరువాయి

అయితే అత్యంత రద్దీగా ఉండే ఈ అప్రాంతంలో పక్కనే నీలోఫర్ ఆస్పత్రి కూడా ఉంది. ఆ ప్రాంతమంతా పొగలు కమ్ముకోవడంతో సహాయ చర్యలకు తీవ్ర అంతరాయం ఏర్పడినట్లు తెలుస్తోంది. అగ్నిమాపక సిబ్బంది ముమ్మరంగా సహాయక చర్యలు కొనసాంచారు. ఈ ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, ఘటనపై పూర్తి వివరాలను దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామని అధికారులు తెలిపారు. అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం లేదు. పోలీసులు ఆ ప్రాంతంలో ట్రాఫికనూ్రేక్రమబద్ధీకరిస్తూ, ఎవరినీ ల్యాబ్ లోపలికి వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. కాగా.. ఉదయం 10:00 గంటల ప్రాంతంలో మొదటి ఫ్లోర్‌లోని ఫోరెన్సిక ల్యాబ్‌లో మంటలు చెలరేగాయి. దీంతో ఆ ఫ్లోర్‌లోని కంప్యూటర్లు, ఫోరెన్సిక సంబంధిత కెమికల్స్‌తో సహా కీలకమైన పత్రాలు కాలి బూడిదయ్యాయి. ఈ ఘటనలో పలు ముఖ్యమైన కేసులకు సంబంధించిన ఫోరెన్సిక రిపోర్టులు అగ్నికి ఆహుతి అయ్యాయి. ఈ మంటల్లో ఫోన్ ట్యాపింగ్‌కు కేసుకు సంబంధించిన హార్డ్ డిస్కులూ కాలిపోయినట్లు సమాచారం.నిమిషాల వ్యవధిలోనే మంటలు భవనంలోని ఇతర ప్రాంతాలకు వ్యాపించాయి. దీంతో లోపల ఉన్న కంప్యూటర్లు, ఇతర ఎలక్టానిక్ పరికరాలు కాలిపోయాయి. అగ్నిప్రమాదం కారణంగా ఆ ప్రాంతమంతా దట్టంగా నల్లటి పొగ అలుముకుంది. ప్రమాదాన్ని గమనించిన కార్యాలయ సిబ్బంది ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. అగ్ని ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని ఐదు ఫైరిరజన్లతో మంటలనున అదుపులోకి తీసుకొచ్చారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగిందని అధికారులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. కాగా, ప్రమాదం గురించి తెలియగానే నార్త్ జోన్ డీఐజీ శ్వేత, ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి ల్యాబ్‌కు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ల్యాబ్‌లో కీలకమైన కేసులు, ఫోరెన్సిక ఆధారాలకు సంబంధించిన డాక్యుమెంట్లు ఏవైనా దెబ్బతిన్నాయా అనే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు. కాగా, ఈ అగ్ని ప్రమాదంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఓటుకు నోటు కేసు సహా పలు కీలక కేసులకు సంబంధించిన డాక్యుమెంట్లు, ఎవిడెన్స్‌లు ఇక్కడే ఉండటంతో ఈ అగ్ని ప్రమాదం వెనుక కుట్ర కోణం ఉండొచ్చని అంటున్నారు.

# మలేసియాలో త్వరలో కొత్త కాన్సులేట్ ఏర్పాటు

మొదటి పేజీ తరువాయి

మూడో స్థానానికి చేరిందన్నారు. ఇండియాలో చదువుకునే విద్యార్థులకు త్వరలోనే తీరువళ్లువర్ స్కాలర్‌షిప్‌లు ఇస్తామని చెప్పారు. యూకే, యూఏఈ, అస్ట్రేలియా, న్యూజిలాండ్, ఒమన్, ఈయూ, అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుందని, విశ్వాసం భారతదేశపు బలమైన కరెన్సీగా మారిందని పేర్కొన్నారు. ఇండియాను ఒక పెద్ద మార్కెట్‌గానే గతంలో చూసే వారని, ఇప్పుడు పెట్టుబడులు, వాణిజ్యానికి హబ్‌గా మారిందని మోదీ తెలిపారు. అభివృద్ధికి విశ్వసనీయమైన భాగస్వామిగా భారత్ నిలుస్తోందన్నారు. యూకే, యూఏఓ, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఒమన్, ఈయూ, యూఎస్ఏ సహా అనేక దేశాలు ఇండియాతో వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నాయని చెప్పారు. మలేసియాను ప్రపంచం లోనే అతిపెద్ద భారతీయ ప్రవాస జనాభాను కలిగిన రెండో దేశంగా మోదీ పేర్కొన్నారు. భారత్–మల◌ేసియా ప్రజల హృదయాలను కలుపుతూ, రెండు దేశాల మధ్య వారధిగా ప్రవాస భారతీయులు నిలుస్తున్నారని ప్రశంసించారు. ఆహారపు అలవాట్లు, భాషా పరంగా ఎన్నో ఇరుదేశాల ప్రజల మధ్య ఎన్నో సామీప్యాలు ఉన్నాయని అన్నారు. భారతీయ సంగీతం, చలనచిత్రాలకు మలేసియాలో ఎంతో ఆదరణ ఉన్నట్టు విన్నానని, ప్రధాని అన్వర్ ఇబ్రహీం కూడా బాగా పాడతారనే విషయం ఇక్కడి వారందిరికీ తెలిసిందేనని అన్నారు. భారత్‌కు తిరిగి వచ్చిన చాలామందికి ఈ విషయం తెలియదని, తాను గత పర్యటనలో ఆశ్చర్యానికి గురయ్యానని చెప్పారు. ఇండియాలోని పాపులర్ హిందీ గీతాలను అన్వర్ ఇబ్రహీం ఆలపిస్తున్న వీడియోలు వైరల్ అయ్యాయని, లెజెండ్రీ ఎంజీఆర్ తమిళ పాటలను ఆయన బాగా ఇష్టపడతారని అన్నారు. దీనికి ముందు, భారత్‌కు చెందిన 800 మందికి పైగా నృత్యకారులు ప్రధానికి విమానాశ్రయం వద్ద స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్ట్ నుంచి మోదీ, అన్వర్ ఇబ్రహీం కలిసి ఒకే కారులో ప్రయాణించారు. భారత సంతతి ఆత్మీయ సమ్మేళనం వద్ద 'భారత్ మాతా కీ జై', 'మోదీ, మోదీ' అనే నినాదాలతో ఆయనకు సాదర స్వాగతం లభించింది.

# మున్సిపల్ ఎన్నికల్లో విజయం మాదే

మొదటి పేజీ తరువాయి

తీసుకుంటుందని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.స్వయం సహాయక సంఘాల మహిళలకు సీఎం రేవంత్ రెడ్డి ఇందిరా మహిళా శక్తి చెక్కుల పంపిణీ చేశారు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం చేసిన అప్పులను, తప్పులను సరిదిద్దుకుంటూ తమ ప్రభుత్వం రాష్ట్ర ప్రగతి కోసం ముందుకు వెళుతోందని ఆయన స్పష్టం చేశారు. పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్, కేంద్రంలో పన్నెండేళ్లుగా ఉన్న మోదీ రాష్టా నికి చేసిందేమీ లేదని విమర్శించిన ఆయన, బీజేపీ , బీఆర్ఎస్ పార్టీల మధ్య 'చీకటి ఒప్పందాలు' ఉన్నాయని సంచలన ఆరోపణలు చేశారు. బీజేపీ కార్యకర్తలు తమ బీ–ఫామ్‌లను బీఆర్ఎస్ ఆఫీసుల నుండి తెచ్చుకుంటున్నారని ఎద్దేవా చేస్తూ, గల్లీలో పనిచేసే నాయకుడిని చూసి కాకుండా ఢిల్లీలో ఉండే పెళ్లి పెద్దను చూసి ఓట్లు వేయడం ఏమిటని ప్రజలను ప్రశ్నించారు. జిల్లా అభివృద్ధికి సంబంధించి ముఖ్యమంత్రి పలు కీలక ప్రకటనలు చేశారు. లకీeదేవిపల్లి రిజర్వాయర్ భూసేకరణను త్వరలోనే పూర్తి చేసి, ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తామని తెలిపారు. మక్తల్, నారాయణ పేట , కొడంగల్ నియోజకవర్గాలకు కృష్ణా జలాలను తరలించి 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పా జంక్షన్ నుండి మన్నెగూడ రోడ్డు పూర్తి కాకపోవడం వల్ల జరిగిన ప్రాణనష్టానికి కేసీఆర్, సబితా ఇంద్రారెడ్డిలే బాధ్యులని విమర్శించిన రేవంత్ రెడ్డి, ప్రస్తుతం కోర్టు కేసులను పరిష్కరించి ఆ రోడ్డు పనులను వేగవంతం చేశామని వెల్లడించారు. భవిష్యత్తులో రీజనల్ రింగ్ రోడ్డు , రేడియల్ రోడ్లు రాబోతున్నాయని, వికారాబాద్ త్వరలోనే ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా మారు



తుందని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ చరిత్రను తాను చెరిపేయాలని చూస్తున్నానని కేటీఆర్, హరీష్ రావు చేస్తున్న విమర్శలకు ముఖ్యమంత్రి ఘాటుగా స్పందించారు. కేసీఆర్ దొంగ పాస్‌పోర్టుల చరిత్ర, దొంగ నోట్ల వ్యవహారం , దళితుడిని సీఎం చేస్తానన్న దొంగ హామీల చరిత్ర తెలంగాణ ఉన్నంత కాలం చెరిగిపోదని, ఆ 'పాపాల భైరవుడి' చరిత్ర ప్రజలకు గుర్తుండేలా చేసే బాధ్యత తనదని ఆయన వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ లాంటి చిల్లర పనులకు నోటీసులు ఇవ్వక ఏం చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే 70 వేల ఉద్యోగాల భర్తీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ వంటి హామీలను అమలు చేశామని గుర్తు చేస్తూ, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో విషం చిమ్మే పాములకు మళ్ళీ పాలు పోయకుండా కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రెండేళ్ల ప్రజాపాలనలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. రెండేళ్ల ప్రజాపాలనలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగిస్తున్నాం. అప్పులున్నా.. ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. ఎన్నికల్లో నిలబడి కొట్లాడాలి కానీ, చీకటి ఒప్పందాలు చేసుకొని ఫెవికాల్ బంధంతో భాజపా, బీఆర్ఎస్ పార్టీలు కాంగ్రెస్‌ను ఓడించాలని కుట్రలు చేస్తున్నాయి. బీఆర్ఎస్‌ను ప్రజలు బొందపెట్టారు. కాంగ్రెస్‌తో పోరాడటం మావల్ల కాదని భాజపాతో బీఆర్ఎస్ కలిసిపోయింది. భాజపా అభ్యర్థుల బీఫామ్‌లు బీఆర్ఎస్ పార్టీలో ఇచ్చే దుస్థితి ఏర్పడింది. స్థానిక సమస్యలు పరిష్కరించేందుకు బీఆర్ఎస్, భాజపా ప్రయత్నించలేదు. ప్రధాని మోదీని చూసి ఓటేయాలని భాజపా నేతలు అడుగుతున్నారు. పదేళ్లలో సమస్యలు పరిష్కరించి ఉంటే బీఆర్ఎస్, భాజపా నేతలు వంగి వంగి దండాలు పెట్టాల్సిన పరిస్థితి ఉండేది కాదు. అడగకుండానే ప్రజలు ఓటేసేవారు. ఓట్లు కావాలి కానీ, ప్రజల సమస్యలను ఏనాడైనా పట్టించుకున్నారా ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టు కోసం రూ.38వేల కోట్లతో నాటి సీఎం రాజశేఖర్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. కేసీఆర్ సీఎం అయ్యాక రంగారెడ్డి జిల్లాలోని ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారు. తెలంగాణ ఉద్యమ నాయకుడినని చెప్పుకొని కేసీఆర్.. రంగారెడ్డి జిల్లాలకు గోదావరి జలాలను ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించారు. గోదావరి జలాలను తీసుకొచ్చి తాండూరు, పరిగి, వికారాబాద్, చేవెళ్ల ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే బాధ్యత మాది అని సీఎం హామీ ఇచ్చారు. కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, కల్లకుంట్ల కిషన్ రావు గుర్తు పెట్టుకోండి తెలంగాణలో మళ్లీ గెలిచేది కాంగ్రెస్సేనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఐదేండ్ల కోసం ఎన్నికైనం.. మరో ఐదేళ్లు పదవిలో ఉంటామని ధీమా వ్యక్తం చేశారు. పదేళ్లు పవర్‌లో ఉన్న బీఆర్ఎస్.. 12 ఏళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ఏనాడు మన సమస్యలని పట్టించుకోలేదని విమర్శించారు. మూసీ నది ప్రక్షాళన చేస్తామంటే బీఆర్ఎస్, బీజేపీ అడ్డుకుంటున్నాయని.. అభివృద్ధి పనులకు కాళ్లల్లో కట్టెలు పెడుతున్నాయని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫోన్ ట్యాపింగ్ పేరుతో పెళ్లాంమొగుళ్ల మాటలు కుడా విన్నరని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి అనైతిక పనులు, తప్పులు చేస్తే నోటీసులు ఇవ్వకపోతే ఏం చేస్తారని ప్రశ్నించారు. దళితలను సీఎం చేస్తానన్న మీ చరిత్రను నేనేలా తూడ్చుతానని.. కేసీఆర్ తెలంగాణ ద్రోహిగా మిగిలిపోతారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. మొఖం చెల్లకే కేసీఆర్ అసెంబ్లీకి రావట్లేదని విమర్శించారు. రెండేళ్ల పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చాం. గత పాలకులు చేసిన తప్పులను సరిదిద్దుకుంటూ ముందుకెళ్తున్నామని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలంతా ఆలోచించి ఓటేయాలని సూచించారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి శ్రీధర్‌బాబు స్థానిక నేతలు సభలో పాల్గొన్నారు.

# గెలిపించే బాధ్యత మీది.. అభివృద్ధి బాధ్యత మాది

మొదటి పేజీ తరువాయి

గృహ నిర్మాణ శాఖ మంత్రిగా ఇండ్లు నిర్మించే బాధ్యత తనదేనని ప్రకటించారు. ఎమ్మెల్యే నుంచి ముఖ్యమంత్రి వరకు అందరూ కాంగ్రెస్ ప్రతినిధులే ఉన్నందున పథకాలను తామే మంజూరు చేయగలమని, ప్రతిపక్ష బిఆర్ఎస్ చేసేదేమీలేదని వారి సొల్లు పురాణం వినాల్సిన అవసరమే లేదని అన్నారు. గతంలో రెండుసార్లు మీరు వారికి చెంప చెళ్లుమనేలా బుద్ధి చెప్పినా మళ్లీ ఏవో కుంటిసాకులు చెబుతున్నారని ఈసారి కూడా మరో సారి వారికి ఓటు ద్వారా బుద్ధి చెప్పండని పిలుపునిచ్చారు. తొర్రూరు మున్సిపాల్టీ పరిధిలో రోడ్లు, కాలువలు తదితరాలను గులాబి రంగు పార్టీకి చెందిన కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేస్తున్నారని ఈ ఎన్నికల తర్వాత వారి చెవులు మెలేసి పనులు చేయిస్తామని లేదా వారిని ఇంటికి పంపిస్తామని ప్రకటించారు. అంతేగాక ఈ ప్రాంతంలో అసంపూర్తిగా ఉండిపోయిన ఇండ్లను పూర్తిచేయిస్తామని చెప్పారు. కాంగ్రెస్, మిత్రపక్షమైన సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని మంత్రి పొంగులేటి కోరారు.వర్ధన్నపేట మున్సిపాల్టీకి మంత్రి వరాలు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఒకవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే మరోవైపు అభివృద్ధి పథకాలను చేపడుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. వర్ధన్నపేట మున్సిపల్ వార్డులలో



ఆయన ప్రచారం సందర్భంగా వరాల జల్లు కురిపించారు. ఈ మున్సిపాల్టీలో ప్రగతి పనుల కోసం పదికోట్ల రూపాయిలను అందిస్తామన్నారు. అంతేగాక ఈ ప్రాంతీయులకు అత్యంత సమస్యాత్మకంగా మారిన హెచ్.టి విద్యుత్ లైన్లను వచ్చేనెల మొదటి వారంలో మార్పిస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ పాలనలో ఏర్పాటైన ఈ మున్సిపాల్టీని వారు పట్టించుకోకుండా దరిద్రాన్ని అంటించి అన్యాయం చేశారని, ఇప్పుడు మిమ్మల్ని మమ్మల్ని ఆడిపోసుకుంటున్నారని మంత్రి పొంగులేటి ధ్వజమెత్తారు. ఈ మున్సిపాల్టీలో ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా కలిపేసిన అన్ని తండాలను వేరుచేసి గ్రామ పంచాయితీలుగా చేస్తామని ప్రకటించారు. గత పదేళ్లలో బిఆర్ఎస్ వారు ఇక్కడ నిర్మించిన ఇండ్లు ఎన్నో చూడాలన్నారు. వచ్చే ఏప్రిల్‌లో మరో విడత ఇండ్లను తాము మంజూరు చేస్తామని తెలిపారు. ఈమేరకు జాబితాలు తయారవుతున్నాయని అన్నారు. గతంలో లంబాడీలను కాంగ్రెస్ ప్రభుత్వమే ఎస్టీ జాబితాలో కలిపిందని గుర్తు చేస్తూ మీ తండాలను పంచాయితీలుగా మారుస్తామని కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని మంత్రి కోరారు. ఈ ప్రాంతంలో అసంపూర్తిగా ఉన్న యల్లమ్మ గుడిని తమ సొంత నిధులతో పూర్తిచేయిస్తానని హామీ ఇచ్చారు.

# ఎస్ పిఎఫ్ సిబ్బందికి భారీ శుభవార్త

మొదటి పేజీ తరువాయి

ఈ ప్యాకేజ్ ప్రకారం ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.1 కోటి వరకు బీమా, విమాన ప్రమాదంలో రూ.1.60 కోట్లు వరకు బీమా అందనుంది. అలాగే శాశ్వత వైకల్యం వచ్చినప్పుడు రూ.80 లక్షల వరకు, లైఫ్ ఇన్సూరెన్స్‌గా రూ.10 లక్షలు లభిస్తాయి. అదేవిధంగా ఉద్యోగుల పిల్లల చదువుకు, డిగ్రీ విద్యకు ప్రత్యేక ఆర్థిక సహాయం, ఆడ పిల్లల వివాహానికి ఆర్థిక భద్రత కల్పించనున్నారు. ప్రమాద సమయంలో అంబులెన్స్, ఎయిర్ అంబులెన్స్ ఖర్చులు, వైద్య సహాయం, కుటుంబ సభ్యుల ప్రయాణ ఖర్చులు కూడా ఈ ప్యాకేజ్‌లో భాగంగా ఉంటాయి. విధి నిర్వహణలో ఉగ్రవాదం, నక్సలైట్ దాడులు లేదా దేశ వ్యతిరేక కార్యకలాపాల్లో ప్రాణాలు కోల్పోతే అదనంగా రూ.10 లక్షల బీమా అందించనున్నారు. ఇదే కాకుండా రుణ సౌకర్యాలు, లాకర్ అద్దెపై రాయితీ, ఖాతాదారులకు ప్లాటినం రూపే డెబిట్ కార్డులు కూడా అందించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ పిఎఫ్ డైరెక్టర్ జనరల్ స్వాతి లక్రా, ఐపీఎస్ మాట్లాడుతూ, ఎస్ పిఎఫ్ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక జీత ప్యాకేజ్ రూపొందించినందుకు ఎస్ బిఐకి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఈ భాగస్వామ్యం కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆధిపత్య పోరు కావాలా.. అభివృద్ధి కావాలా

మొదటి పేజీ తరువాయి

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా తూప్రాన్‌లో హరీశ్‌రావు పర్యటించారు. ఈ సందర్భంగా అల్లాపూర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో హరీశ్‌రావు ప్రసంగించారు. అక్కడి నుంచి తూప్రాన్ బస్టాండ్ వరకు భారీ రోడ్ షో నిర్వహించారు. అనంతరం బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతూ.. తూప్రాన్ అభివృద్ధిని గుర్తుచేస్తూ, కాంగ్రెస్ పాలనను ఎండగట్టారు. ఒక పరేడు తూప్రాన్‌లో మంచినీళ్లు కావాలంటే మూడు రోజులకోసారి వచ్చేవని.. గీతారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నపరేడు బిందెలతో అడ్డం పడి నిరసన తెలిపేవాళ్లు అని హరీశ్‌రావు గుర్తుచేశారు. కానీ కేసీఆర్ వచ్చాక ప్రతి ఇంటికి నల్లా పెట్టి ఆడబిడ్డలకు నీటి కష్టాలను తీర్చారని తెలిపారు. తూప్రాన్‌ను మున్సిపాలిటీ చేసింది, ఆర్డీవో ఆఫీస్ తెచ్చింది, ఫోర్ లైన్ రోడ్డు వేసి హైవేలా మార్చింది కారు గుర్తు కాదా అని ప్రశ్నించారు. కేసీఆర్ రాకముందు తూప్రాన్‌కు పిల్లనియ్యాలంటే నీళ్లు మోపిస్తారని భయపడే వాళ్లు.. కానీ ఇపరేడు తూప్రాన్‌కే పిల్లనియ్యాలన్నట్టు పరిస్థితి మారిందని అన్నారు. పది లక్షలు లేని భూమిని కోటి రూపాయలు చేసింది కేసీఆర్. కానీ రేవంత్ రెడ్డి వచ్చాక భూముల ధరలు పాతాళానికి, బంగారం ధరలు ఆకాశానికి చేరాయని హరీశ్‌రావు అన్నారు. రెండేళ్ల నుంచి తూప్రాన్ అభివృద్ధిని అడ్డుకున్నారని హరీశ్‌రావు తెలిపారు. రోడ్లకు గుంతలు పడితే డాంబర్ వేసే దిక్కు కూడా ఈ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. కేసీఆర్ ఉన్నపరేడు పంట పంటకు రైతుబంధు పడేది. కరోనా కష్టకాలంలో కూడా ఆపలేదని తెలిపారు. రేవంత్ రెడ్డి రెండు రైతుబంధులు ఎగ్గొట్టాడన్నారు. బతుకమ్మ చీరలు బంద్, కేసీఆర్ కిట్ బంద్, గొర్రెల పంపిణీ బంద్, చేప పిల్లలు బంద్, దళిత బంధు బంద్.. అన్నీ బంద్ పెట్టి ప్రజలను గోస పెడుతున్నాడని పేర్కొన్నారు. సద్ది తిన్న రేవు తలవాలి.. మనకు అన్నం పెట్టిన కేసీఆర్ ను మర్చిపోవద్దని అన్నారు. బీజేపీ వాళ్లు ఓట్ల కోసం గిర్ర గిర్ర తిరుగుతున్నారని. వాళ్లు తూప్రాన్‌కు ఏమైనా చేశారా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఒక్క హాస్పిటల్ కట్టించారా కల్యాణ లకిe ఇచ్చారా రూ. 15 లక్షలు వేస్తామని 12 ఏళ్లుగా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణకు ఒక్క ప్రాజెక్టు ఇవ్వలేదన్నారు. పువ్వు గుర్తుకు ఓటేసినా, ఓటును మోరీలో పారేసినా ఒక్కటే. అది దండుగ అని వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే రేవంత్ రెడ్డికి కళ్లు నెత్తికెక్కి మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. పెన్షన్ ఎపరేడు ఇస్తావ్ అని అడిగితే లాగుల తొండలు వేస్తా అంటాడని.. హామీలు అడిగితే పేగులు మెడలో వేసుకుంటా అంటాడని.. తులం బంగారం ఏది అంటే గుడ్లు పీకి గోటీలు ఆడుతా అంటాడని అన్నారు. ఇది ఒక ముఖ్యమంత్రి మాట్లాడే భాషేనా ఇలాంటి బూతుల ముఖ్యమంత్రికి ఈ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఐదేళ్ల కోసం కౌన్సిలర్లను గెలిపించాలని సూచించారు. రెండేళ్ల తర్వాత వచ్చేది మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు. తూప్రాన్ అభివృద్ధి బాధ్యత నాది. ఏ పని ఉన్నా నేను చేసి పెడతా అని హామీ ఇచ్చారు.

# దేశ సాంకేతిక రంగంలో మలుపురాయి

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్ హైటెక సిటీతో మారిన టెక్నాలజీ గతి, ఇప్పుడు అమరావతి క్వాంటమ్ వ్యాలీతో మరింత జోరుగా ముందుకు సాగనుంది. ప్రపంచంలోనే అత్యాధునిక క్వాంటమ్ హబ్‌ల సరసన అమరావతిని నిలపాలనే సంకల్పంతో ఈ ప్రాజెక్టును సీఎం చంద్రబాబు తలపెట్టారు. క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుతో ప్రపంచ స్థాయి పరిశోధన కేంద్రాలు, గ్లోబల్ టెక్నాలజీ సంస్థల పెట్టుబడులు, స్టార్టప్ ఎకో సిస్టం విస్తరణ, లక్షల మంది యువతకు నైపుణ్య శిక్షణ, పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించాలని ముఖ్యమంత్రి ఆశిస్తున్నారు. ఆగస్టు నాటికి క్వాంటమ్ వ్యాలీ భవనం సిద్ధం చేసి, డిసెంబరు కల్లా క్వాంటమ్ కంప్యూటర్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దీని ద్వారా దేశంలో క్వాంటమ్ విప్లవానికి నాయకత్వం వహించే అవకాశం రాష్టానికి దక్కనుంది. కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు తుళ్లూరు మండలం ఉద్దండరాయుని పాలెం గ్రామంలో 'క్వాంటమ్ వ్యాలీ' భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దీని కోసం ప్రభుత్వం 50ఎకరాలు కేటాయించింది. కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, కందుల దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు. భారతదేశపు మొదటి 133 క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతికి తీసుకురావడానికి ఐబీఎం, టీసీఎస్, ఎల్అండ్‌టీ సంస్థలు కీలకంగా వ్యవహరిస్తున్నాయి. క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్స్,



క్వాంటమ్ సెన్సర్స్, కృత్రిమ మేధ, సైబర్ సెక్యూరిటీ, డిఫెన్స్, హెల్త్‌కేర్, కీలక రంగాల్లో పరిశోధనలు, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధికి ఇక్కడ చోటు దక్కనుంది. ప్రపంచంలో బోస్టన్, సింగపూర్, షాంఘై లాంటి క్వాంటం కేంద్రాలతో సమానంగా ఇది నిలవనుంది. ప్రపంచ క్వాంటమ్ టెక్నాలజీ రంగంలో ఏపీని అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంతో రూపొందించిన ఈ 'అమరావతి క్వాంటమ్ వ్యాలీ' ప్రాజెక్ట రాష్టానికి, దేశానికి మైలురాయిగా నిలవనుంది. భారతదేశంలోనే మొదటి 133 క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్‌కు అమరావతి వేదిక కానుంది. క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్స్, క్వాంటమ్ సెన్సార్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డిఫెన్స్, హెల్త్‌కేర్, ఫైనాన్స్ వంటి కీలక రంగాల్లో పరిశోధనలు, ఆవిష్కరణలు, ఉత్పత్తులు, నైపుణ్యాభివృద్ధికి ఇక్కడ విస్తృత అవకాశాలు ఉంటాయి. ప్రపంచంలోనే అత్యాధునిక క్వాంటమ్ హబ్‌ల సరసన అమరావతిని నిలబెట్టాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి ఈ ప్రాజెక్టును రూపొందించారు. ఈ వ్యాలీ ఏర్పాటుతో ప్రపంచ స్థాయి పరిశోధన కేంద్రాలు, గ్లోబల్ టెక సంస్థల పెట్టుబడులు, స్టార్టప్ ఎకోసిస్టమ్ విస్తరణ, లక్షలాది మంది యువతకు అధునాతన నైపుణ్య శిక్షణ అందుబాటులోకి వస్తాయి. ఆగస్టు నాటికి భవన నిర్మాణం పూర్తిచేసి, డిసెంబర్‌లోపు క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. క్వాంటమ్ టెక్నాలజీ ద్వారా సామాన్యుడి జీవితంలో గణనీయమైన మార్పులు వస్తాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది. దీంతో ఫార్మా రంగంలో పరిశోధనలు వేగవంతం కానున్నాయి. వ్యవసాయంలో వాతావరణ అంచనాలు, నీటి వినియోగం, దిగుబడి అంచనాలు కచ్చితంగా ఉండటం, బ్యాంకింగ్ డిజిటల్ లావాదేవీల భద్రత పెరగడం వంటి అనేక ప్రయోజనాలు లభించనున్నాయి. అమరావతి క్వాంటమ్ వ్యాలీ ప్రపంచంలోని బోస్టన్, సింగపూర్, షాంఘై వంటి క్వాంటమ్ కేంద్రాలతో సమానంగా నిలవనుంది. భవిష్యత్తులో అమరావతి.. క్వాంటమ్ కంప్యూటర్ల తయారీకి ప్రపంచ కేంద్రంగా మారనుందని ప్రభుత్వ వర్గాలు ధీమా వ్యక్తం చేశాయి. ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి ప్రముఖ సంస్థల భాగస్వామ్యంతో క్వాంటమ్ కంప్యూటర్ సెంటర్‌ను ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. క్వాంటమ్ వ్యాలీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సహా ఏపీ మంత్రులు నారా లోకేశ్, నారాయణ, కందుల దుర్గేశ్, తాడికొండ ఎమ్మెల్యే శ్రవణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, ప్రపంచ దిగ్గజ ఐటీ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ దేశానికి గేమ్ ఛేంజర్

**అమరావతి,ఫిబ్రవరి 7(నినాదం):**

అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ దేశానికి గేమ్ ఛేంజర్ కానుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీ భవన నిర్మాణానికి కేంద్రమంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి సీఎం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడారు. ఆనాడు హైదరాబాద్‌లో హైటెక సిటీ ఏర్పాటుతో టెక్నాలజీ రంగంలో విప్లవం సాధించామని, ఇప్పుడు క్వాంటమ్‌తో మరింత ముందుకు వెళుతున్నామని అన్నారు. ఈ టెక్నాలజీ ద్వారా ఇక్కడి పరిశోధనలు ప్రపంచానికి దిక్సూచి అవతాయనడంలో సందేహం లేదన్నారు. ఇకపోతే రాష్ట్ర భవిష్యత్తు అంతా విద్యార్థులపైనే ఆధారపడి ఉంది. అందుకే నా ఆశన్నీ వారిపైనే. చరిత్ర రాయాలన్నా, దాన్ని తిరగరాయాలన్నా యువతకే సాధ్యం. మన యువత సాంకేతిక రంగంలో క్వాంటం వేగంతో దూసుకెళ్తోంది. క్వాంటమ్ ప్రాజెక్టుకు ఇప్పుడే శంకుస్థాపన చేసుకున్నాం. భవిష్యత్తులో ఇక్కడి నుంచే ఉత్పత్తి, సరఫరా చేస్తాం అని వివరించారు. వాజ్‌పేయి హయాంలో హైటెక సిటీ.. హైదరాబాద్‌కు గేమ్ ఛేంజర్‌గా మారింది. కానీ, ఈ క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ దేశానికి గేమ్ ఛేంజర్ కానుంది. ప్రపంచానికి సరికొత్త ఆవిష్కరణలు అందించే అవకాశాలు ఇక్కడే ఉన్నాయి. వచ్చే 40 ఏళ్ల అవసరాలు దృష్టిలో పెట్టుకుని ఇవన్నీ చేపట్టాం అని చంద్రబాబు అన్నారు. దేశానికి సరైన సమయంలో సరైన వ్యక్తి ప్రధానిగా ఉన్నారు. క్వాంటమ్ మిషన్ కార్యకలాపాలు ఏపీ నుంచే ప్రారంభం కావాలని కోరా. టీసీఎస్, ఐబీఎం, ఎల్అండ్‌టీ ప్రతినిధులతో మాట్లాడా. ఒకట్రెండు నెలల్లోనే ఒప్పందాలు పూర్తి కావాలని కంపెనీలను కోరామని అన్నారు. ఈ ఏడాది చివరి నాటికి మొదటి క్వాంటమ్ కంప్యూటర్ రావాలని చెప్పా. ఏప్రిల్ 14న ఇక్కడ మరో రెండు క్వాంటమ్ సెంటర్లు ఏర్పాటు చేస్తాం. 2030లోగా 2.5 లక్షల మంది క్వాంటమ్ నిపుణులు కావాలి. దేశంలోని వందమంది ఐటీ నిపుణుల్లో 35శాతం మంది తెలుగువాళ్లే.

# విజన్ లేని నాయకుల పాలన..

### కేంద్ర నిధులు పక్కదారి
### మట్టిగుట్టలు మాయం చేశారు
### బీజేపీ నాగర్ కర్నూలు జిల్లా అధ్యక్షుడు నరేందర్ రావు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 7 (నినాదం):** నాగర్ కర్నూల్ జిల్లాను అభివృద్ధి చేయాలి అనే విజన్ తో గత నాయకులు ప్రస్తుత నాయకులు పనిచేయలేదని బిజెపి నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు నరేందర్ రావు అన్నారు. శనివారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీల అభివృద్ధి కోసం కేంద్రం నిధులు మంజూరు చేస్తే వాటిని పక్కదారి పట్టించి దోచుకున్నారని ఆరోపించారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో సుందరీ కరణ పేరుతో మినీ ట్యాంక్బండ్ నిర్మించారని మినీ ట్యాంక్ బండ్ పై కనీసం మూత్రశాలలు కూడా లేవని ఎద్దేవా చేశారు. మినీ ట్యాంక్ బండ్ మీదుగా తాడూరు కు వెళ్లే మార్గంలో హై లెవెల్ బ్రిడ్జి నిర్మించి రెండు లైన్ల రోడ్డు వేయాలని పలుమార్లు చెప్పిన అధికారులు పట్టించుకోలేదన్నారు. సిద్దిపేటలో మాదిరిగా నాగర్ కర్నూల్ గుడిపల్లి




గట్టును టూరిజం స్పాట్ గా చేసే అవకాశం ఉన్న అభివృద్ధి చేయలేదని అన్నారు నాగర్ కర్నూల్ జిల్లాకు కేంద్రీయ విద్యాలయం ఇచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉన్న నాయకులు 32 ఎకరాల స్థలాన్ని చూయించలేకపోతున్నారని గతంలో నాయకుడు బట్టలు అమ్ముకునే వ్యాపారంలో బిజీగా ఉన్నారని ప్రస్తుత నాయకుడు ఇంజక్షన్ ఇవ్వడంలో బిజీగా ఉన్నారని ఎద్దేవా చేశారు. నాగర్ కర్నూల్ నియోజకవర్గంలో మట్టి గుట్టలు మాయం చేశారని . సోమశిల కు హైవే రోడ్డు వేయడం ద్వారా కొల్లాపూర్ చౌరస్తాలో కొంత కళ వచ్చిందని కేంద్రం ఇచ్చిన మెడికల్ కళాశాల వల్ల పట్టణంలో కళ వచ్చిందే తప్ప ఇక్కడి నాయకులు చేసిన అభివృద్ధి ఏమీ లేదని అన్నారు. భూత్పూర్ నుండి మన్ననూరు వరకు నాలుగు లైన్ల రోడ్డు కోసం దరఖాస్తు చేసేందుకు నాయకులకు తీరిక లేదని అన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల పింఛన్ నేటికీ ఇవ్వలేదని ఎలా బతకాలి అని రిటైర్డ్ ఉద్యోగులు తీవ్ర ఆవేదనతో ఉన్నారన్నారు. రహదారులు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉన్నాయని వైన్ షాపులు మాత్రం బాగా అభివృద్ధి చెందాయని అన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు నిరుద్యోగ భృతి మహిళలకు తులం బంగారం స్కూటీ ఎన్నో అమలు కాని హామీలు ఇచ్చి ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు మోసం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం దిట్ట అని అన్నారు. ప్రజలను ఓట్లు అడిగే నైతిక హక్కు రెండు పార్టీలు కోల్పోయాయని ప్రజలు బిజెపి వైపు చూస్తున్నారని తెలిపారు. రాష్ట్ర అధికార ప్రతినిధి దిలీప్ ఆచారి మాట్లాడుతూ.. 22 మంది బిజెపి బలపరిచిన మున్సిపాలిటీ అభ్యర్థులను గెలిపించాలని మీరు అభ్యర్థులను గెలిపిస్తే కేంద్ర నిధులతో మున్సిపాలిటీని అభివృద్ధి చేసే బాధ్యత బిజెపి నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ ప్రజలను కోరారు. సబ్కా సాథ్ సబ్కా వికాస్ సబ్కా విశ్వాస్ అనే నినాదంతో భారతీయ జనతా పార్టీ పని చేస్తుందని దేశ ప్రజలంతా బిజెపి వైపు చూస్తున్నారని. రేపు రాబోయే ఏ ఎన్నికలైనా నాగర్కర్నూల్ నియోజకవర్గంలో బిజెపి జెండా ఎగరవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

## నేటితో ముగియనున్న పోస్టల్ బ్యాలెట్ గడువు

**నిజామాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 7 (నినాదం) :** మున్సిపల్ ఎన్నికల నిర్వహణ విధులలో నిమగ్నం అయి ఉన్న ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా పోస్టల్ బ్యాలెట్ సదుపాయం ఆదివారం సాయంత్రం 5.00 గంటలకు ముగుస్తుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఎన్నికల విధులలో ఉన్న ఉద్యోగులు సంబంధిత కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎన్నికల విధులు కేటాయించబడిన ఉద్యోగులు ఐ.డీ.ఓ.సీ(కలెక్టరేట్)లో పోస్టల్ బ్యాలెట్ సదుపాయం వినియోగించుకునేలా ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేశామని అన్నారు. అదేవిధంగా బోధన్ మున్సిపల్ ఎన్నికల విధులు నిర్వహిస్తున్న వారు బోధన్ మున్సిపల్ కార్యాలయంలో, ఆర్మూర్ మున్సిపల్ ఎన్నికల విధులు నిర్వహిస్తున్న వారు ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో, భీంగల్ మున్సిపల్ ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు భీంగల్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ సదుపాయం ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపారు. ఎన్నికల విధుల్లో నిమగ్నం అయి ఉన్న పోలీసు సిబ్బంది కూడా పోస్టల్ బ్యాలెట్ ను వినియోగించుకోవాలని అన్నారు.

## 5వ టౌన్ పోలీసుల ఫ్లాగ్ మార్చ్




**నిజామాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 7 (నినాదం):** రాబోవు మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో భయాందోళనలు తొలగించే ప్రయత్నంలో భాగంగా శనివారం రోజున నిజామాబాద్ నగరం లో గల 5 వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పోలీసు కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు టౌన్ పరిధిలో ఖిల్లా చౌరస్తా నుండి హష్మీ కాలనీ మీదుగా శాంతి నగర్ ఈద్గా వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ ఫ్లాగ్ మార్చ్ లో నిజామాబాద్ నగర ఎసిపి ప్రకాష్, సీఐ లు, ఎస్సై లు, క్యు ఆర్ టీ సిబ్బంది, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రిడిటేషన్ కార్డుల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానం

### 9 నుండి ఆన్లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలి

### నాగర్ కర్నూల్ కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్ కర్నూల్ ప్రతినిధి ఫిబ్రవరి 7 (నినాదం):** రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నిబంధనల ప్రకారంగా సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో 2026--28 సంవత్సరానికి జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీ కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదవత్ సంతోష్



తెలిపారు.ప్రస్తుతం అమల్లో ఉన్న అక్రిడిటేషన్ కార్డుల కాలపరిమితి గడువు ఫిబ్రవరి 28తో ముగియనున్నందున అర్హత కలిగిన వర్కింగ్ జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కార్డుల కోసం మీడియా యాజమాన్యాలు తమ జర్నలిస్టుల పేర్ల జాబితాను (ఓరిజినల్) జిల్లా పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. మీడియా యాజమాన్యాల ద్వారా పంపిన పేర్లలో ఉన్న జర్నలిస్టులు సమాచార పౌరసంబంధాల శాఖ అధికారిక వెబ్‌సైట్ http://ipr.telangana.gov.in ద్వారా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. జిల్లా స్థాయిలో ఆన్ లైన్ దరఖాస్తులను ఫిబ్రవరి 9 నుండి సమర్పించాలని, అర్హులైన జర్నలిస్టులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు.

# ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యం





### గుంటుపల్లి శ్రీనివాసరావు
### టిఎన్జీవో మున్సిపల్ ఉద్యోగుల ఫోరం క్యాలెండర్ ఆవిష్కరణ

**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 7 (నినాదం):** నగరంలోని టిఎన్జీవో భవనంలో తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ మున్సిపల్ ఉద్యోగుల ఫోరం ఆధ్వర్యంలో 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిఎన్జీవో యూనియ న్ జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా గుంటుపల్లి మాట్లాడుతూ, మున్సి పల్ శాఖలో పని చేస్తున్న ఉద్యోగు ల సమస్యల పరిష్కారంలో టిఎన్జీవో యూనియన్ ఎల్లప్పుడూ ముందుండి పోరాడుతుందని తెలిపారు. ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా మున్సిపల్ ఉద్యోగుల ఫోరం పనిచేస్తోందని, ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి ఉద్యోగులంతా ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు మున్సిపల్ ఉద్యోగులు విధుల్లో ఎదుర్కొంటు న్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకు నేందుకు ఈ ఫోరం ఒక బలమైన వేదికగా పనిచేస్తుందని పేర్కొన్నా రు. నూతన సంవత్సరంలో ఉద్యోగులందరూ అంకితభావంతో విధులు నిర్వర్తించి ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ సెక్రటరీ తాళ్లూరి శ్రీకాంత్, మున్సిపల్ ఉద్యోగుల ఫోరం అధ్యక్షులు సుధాకర్, కార్య దర్శి శ్రీనివాసరావు, మున్సిపల్ శాఖ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు బుర్రి వెంక టేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అలాగే వివిధ విభాగాలకు చెందిన ఉద్యో గులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

### ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు

## పోస్టల్ బ్యాలెట్ సదుపాయం

**నేడు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్**

**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 07 :(నినాదం):** మున్సిపాలిటీల పరిధిలో ఓటరుగా నమోదు అయి, ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న జిల్లా మరియు ఇతర జిల్లాలకు చెందిన ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకు నేందుకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.నేడు (ఫిబ్రవరి 8, ఆదివారం) ఉదయం 10.00



గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు మున్సిపాలి టీల పరిధిలో ఏర్పాటు చేసిన ఓట ర్ ఫెసిలిటేషన్ సెంటర్లలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించినట్లు ఆయన ఒక ప్రకటన లో పేర్కొన్నారు.ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ఖమ్మం రూరల్ ఎంపీడీవో కార్యాలయ మీటింగ్ హాల్‌లో, మధిర మున్సిపా లిటీలో మధిర ఎంపీడీవో కార్యా లయ మీటింగ్ హాల్‌లో, కల్లూరు మున్సిపాలిటీలో కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, వైరా మున్సి పాలిటీలో వైరా తహసీల్దార్ కార్యాలయంలో, సత్తుపల్లి మున్సి పాలిటీలో సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయంలో ఓటర్ ఫెసిలి టేషన్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.సంబంధిత మున్సిపా లిటీల పరిధిలో ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు తమకు కేటా యించిన కేంద్రాల్లో తప్పనిసరిగా హాజరై పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలా గే సంబంధిత శాఖాధికారులు ఈ సమాచారాన్ని తమ శాఖల సిబ్బం దికి తక్షణమే తెలియజే యాలని జిల్లా ఎన్నికల అధికారి ఆ ప్రకటన లో పేర్కొన్నారు.

## మహిళలు ఉపాధి పొంది ఆర్థికంగా ఎదగాలి

### రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ ఎండి సబిత

**గద్వాల ప్రతినిధి, ఫిబ్రవరి 7 (నినాదం):** ప్రభుత్వం, స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో మహిళలకు ఇచ్చే వివిధ శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని ఉపాధి పొంది ఆర్థికంగా ఎదగాలని క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ రాష్ట్ర ఎండి సబిత అన్నారు. శనివారం గద్వాలలో పర్యటించిన ఆమె రాస్ మొబైల్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహిస్తున్న కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం 2025 సంవత్సరంలో క్రిస్మస్ సందర్భంగా వివిధ చర్చిలకు వైట్ వాష్, ఎలక్ట్రికల్ లైటింగ్ కొరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో పలు చర్చిలను సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ కార్పొరేషన్ ఇంచార్జి జిల్లా అధికారిని నుషిత, సొసైటీ మేనేజర్ బెనహర్ రాస్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా 11న పబ్లిక్ హాలిడే

### ఓటు హక్కు వినియోగానికి వేతనంతో కూడిన సెలవు
### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సంతోష్

**గద్వాల ప్రతినిధి, ఫిబ్రవరి 7 (నినాదం):** రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలు - 2026 సందర్భంగా ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియో గించుకునేందుకు, జిల్లాలో ఎన్నికలు నిర్వహించనున్న మున్సిపాలిటీల పరిధిలో ఫిబ్రవరి 11 (బుధవారం) నాడు పబ్లిక్ హాలిడే ప్రకటించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11న ఎన్నికలు జరగనున్న గద్వాల, అలంపూర్, అయిజ, వడ్డేపల్లి మున్సిపాలిటీల పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ-ప్రైవేటు సంస్థలు, వ్యాపార సంస్థలకు పబ్లిక్ హాలిడే వర్తిస్తుందని కలెక్టర్ తెలిపారు. ఎన్నికలు జరగనున్న సంబంధిత మున్సిపాలిటీల పరిధిలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలు మరియు వ్యాపార సంస్థల (ఫర్ములు)లో పనిచేస్తున్న ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని సంబంధిత యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. ఎన్నికల పోలింగ్ నిర్వహణకు వినియోగించే అన్ని ప్రభుత్వ భవనాలు, విద్యా సంస్థలకు ఫిబ్రవరి 10 (మంగళవారం) నాడు కూడా సెలవు ప్రకటించినట్లు తెలిపారు. అదేవిధంగా, ఓట్ల లెక్కింపు కోసం వినియోగించే ప్రభుత్వ విద్యా సంస్థల భవనాలకు లెక్కింపుకు ముందు రోజు అయిన ఫిబ్రవరి 12 (గురువారం) మరియు లెక్కింపు రోజు ఫిబ్రవరి 13 (శుక్రవారం) రెండు రోజుల పాటు లోకల్ హాలిడే వర్తిస్తుందని పేర్కొన్నారు. ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రతి ఓటరు తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించు కోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కోరారు.

## ఓట్ల లెక్కింపు పారదర్శకంగా నిర్వహించాలి

### కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం

**వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 7 (నినాదం):** మున్సిపాలిటీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా, పారదర్శకంగా నిర్వహించాలని, లెక్కింపు సమయంలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్త పడాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శనివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఐడిఓసి మీటింగ్ హాల్‌లో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియపై కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లకు ఇచ్చిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ కౌంటింగ్ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ చెల్లుబాటు అయ్యే ఓట్లను, చెల్లుబాటు కాని ఓట్లను చాలా జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. ఒకసారి రిటర్నింగ్ అధికారి ఏదైనా ఓటును ఇన్వాల్యూడ్ ఓటుగా పరిగణిస్తే దానిని మళ్ళీ పరిగణనలోకి తీసుకోకూడదని చెప్పారు. అభ్యర్థులు సరైన కారణాలతో లిఖితపూర్వక నోటీసు ఇచ్చినప్పుడు




మాత్రమే రీ-కౌంటింగ్‌పై నిర్ణయం తీసుకోవాలని, దీనిపై తుది నిర్ణయం రిటర్నింగ్ అధికారిదేనని తెలిపారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి అభ్యర్థి తరపున ఒక వ్యక్తికి మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు. ఎన్నికల నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ కౌంటింగ్ ప్రక్రియను విజయవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో టిఓటి శ్రీనివాసులు, ఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షణకు పకడ్బందీ ఏర్పాట్లు

- **స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి**

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షించేందుకు 27 లోకేషన్లలో 30 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించినట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. శనివారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో సూక్ష్మ పరిశీలకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, నిష్పక్షపాతత్వం, స్వేచ్ఛాయుత వాతావరణం నెలకొనేలా సూక్ష్మ పరిశీలకులు కీలక పాత్ర పోషించనున్నారని ఆమె పేర్కొన్నారు. పోలింగ్ ప్రక్రియ మొత్తం ఎన్నికల నియమావళికి అనుగుణంగా జరుగుతున్నదీ లేదీ పరిశీలించి, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చర్యలు తీసుకునే



బాధ్యత వీరిపై ఉంటుందని వివరించారు. పోలింగ్ రోజున ఓటింగ్ ప్రారంభం నుంచి ముగింపు వరకు అన్ని లోకేషన్లలో నిరంతర పర్యవేక్షణ చేపట్టి, సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జోనా తదితరులు పాల్గొన్నారు.

## ఖాజ కుత్బుద్దిన్ సేవలు చిరస్మరణీయం

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సాయినాథ్ రెడ్డి

**వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 7 (నినాదం):** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా వ్యవస్థాపకులు, మాజీ చైర్మన్ స్వర్గీయ ఖాజ కుతుబుద్దీన్ సేవలు చిరస్మరణీయమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాయినాథ్ రెడ్డి అన్నారు. శనివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని బ్లడ్ బ్యాంక్ సెంటర్ లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మాజీ చైర్మన్ ఖాజ కుత్బుద్దిన్ రెండవ వర్ధంతి సందర్భంగా స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సాయినాథ్ రెడ్డి, రీజినల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జావిద్ లు హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదాన శిబిరంలో యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం రక్తదానం చేసిన రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. డాక్టర్ సాయినాథ్ రెడ్డి మాట్లాడుతూ ఖాజ కుత్బుద్దిన్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా వనపర్తి జిల్లా ప్రజలకు విశిష్ట సేవలు అందించారని ఆయన కొనియాడారు. ఆర్.ఏం.ఓ డాక్టర్ మొహమ్మద్ జావిద్ మాట్లాడుతూ కరోనా సమయంలో రక్తదాన శిబిరాలతో పాటు అవసరం ఉన్న వారికి ఆక్సిజన్ కాంసెంట్రేటర్లు జిల్లా కేంద్రంలో అందుబాటులో ఉంచి కరోనా బాధితులకు ఉచితంగా సరఫరా చేస్తూ బాధితులకు అండగా నిలిచారని అన్నారు. బాధితులకు నిత్యవసర సరుకులు కూడా అందజేశారని ఆయన గుర్తు చేశారు. అలాంటి మహనీయుని ఆశయాలను ముందుకు




తీసుకెళ్లాలని అన్నారు. వారి రెండవ వర్ధంతిని పురస్కరించుకొని రక్తదానం శిబిరం ఏర్పాటు చేసిన రెడ్ క్రాస్ జిల్లా కోఆర్డినేటర్ ఆర్.రాజేందర్ కుమార్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది ఫెరోజ్, రెడ్ క్రాస్ సిబ్బంది గోవిందు, బిఆర్ఎస్ నాయకులు హర్షద్ లను ప్రత్యేకంగా అభినందించారు. ఖాజ కుత్బుద్దిన్ అభిమానులుగా వారి ఆశయాలు నెరవేర్చడానికి ఎల్లప్పుడూ పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వనపర్తి జిల్లా వైస్ చైర్మన్ సయ్యద్ కలామ్ పాష, రెడ్ క్రాస్ జిల్లా సభ్యులు అహ్మద్ బిన్ ఒమర్,రెడ్ క్రాస్ సభ్యులు వసీం, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది మహమూద్, తిరుపతయ్య, జే.లక్ష్మీ, ఐసిటిసి కౌన్సిలర్ బండారు శ్రీనివాసులు పాల్గొన్నారు.

## సేంద్రీయ పద్ధతిలో పంటలు పండించాలి

### చట్టపరమైన సమస్యలుంటే సంప్రదించండి
### జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఏ. నాగరాజ్


**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయాన్ని చేయడం ప్రతి రైతు అలవాటు చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఏ. నాగరాజ్ సూచించారు. న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చిట్యాలలోని రైతు వేదికలో శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతే దేశానికి వెన్నెముక అన్నారు. చట్టపరమైన రైతు సమస్యలు ఏమున్నాకూడా జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలని వారు పేర్కొన్నారు. ఎరువుల షాపులు నకిలీ ఎరువులు, నకిలీ విత్తనాల పర్యవేక్షణ కోసం అగ్రికల్చర్ ఆఫీసర్‌కు పలు సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ ప్లీడర్ బోట్ల సుధాకర్, అడ్వొకేట్స్



బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి. శ్రావణ్ రావు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ పి. శ్రీనివాస్, స్పెషల్ పి.పి.నిమ్మల విష్ణువర్ధన్, చిట్యాల గ్రామ సర్పంచ్ తౌటం లక్ష్మి, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస రెడ్డి, న్యాయవాదులు మంగళపల్లి రాజ్ కుమార్, కొత్తూరి మహేందర్ రెడ్డి, పారా లీగల్ వాలంటీర్ ఆరేపెల్లి తిరుపతి, రైతులు, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన..

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో జరగనున్న సీఎం పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సంకీర్త్ తో కలిసి సీఎం ప్రత్యేక సెక్యూరిటీ అధికారి వాసుదేవరెడ్డి పరిశీలించారు. శనివారం రేగొండ మండలం కొడవటంచలో పర్యటించి సీఎం రేవంత్ రెడ్డి పర్యటించే హెలిప్యాడ్, ఆలయ ప్రాంతాలతో పాటు ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేసిన గెస్ట్ హౌస్ లను పరిశీలించి అక్కడి నుండి ఘనపురం మండలం చెల్పూరు పరిధిలోని వేయి క్వార్టర్స్ ఎదురుగా జరుగనున్న బహిరంగ సభ ప్రాంగణం, హెలిప్యాడ్ లను పరిశీలించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం ప్రత్యేక సెక్యూరిటీ అధికారి వాసుదేవా రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కోటంచ దేవస్థానంలో పూజ కార్యక్రమం అనంతరం విశ్రాంతి భవనం ప్రారంభిస్తారని, అనంతరం దేవాలయ పరిశీలిస్తారని తెలిపారు. అనంతరంభూపాలపల్లికి చేరుకొని చెల్పూర్ పరిధిలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. విద్యుత్తు శాఖ నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. సభా ప్రాంగణంలో 11 స్క్రీన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆర్ అండ్ బి అధికారులు హెలిప్యాడ్ వద్ద నీళ్లు చల్లడం చేయాలన్నారు. అత్యవసర వైద్య సేవలకు



స్పెషలిస్ట్ వైద్యులు, సేఫ్ హౌస్, రక్త దాతతో పాటు 108 లు, మూడు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని తెలిపారు. హెలిప్యాడ్ చుట్టూ బెలూన్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయరాదని సూచించారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డీఓ హరికృష్ణ, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మొరిశెట్టి నివేదిత లక్షాదికి ప్రజలు బ్రహ్మరథం

## 46వ వార్డులో ప్రచార జోరు

## పెరుగుతున్న మహిళల మద్దతు

## అభివృద్ధి సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

## నివేదిత లక్షాది





**సూర్యాపేట ప్రతినిధి ఫిబ్రవరి 7 (నినాదం):** సూర్యాపేట మున్సిపల్ ఎన్నికలలో భాగంగా 46వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నివేదిత లక్షాది గెలుపు దిశగా పయనిస్తున్నారు. వారం రోజుల నుండి వారు చేస్తున్న ప్రచారం విజయోత్సవ ర్యాలీని తలపిస్తుంది. పలుమార్లు ఓటు వేసిన తమ ఓటుకు ఫలితం లేకుండా పోయిందని ఈసారి తమ ఓటును నివేదితకు వేస్తామని వార్డు ప్రజలు ఇప్పటికే ఢంకా పదంగా చెబుతున్నారు. ముఖ్యంగా తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను గడపగడపకు వివరిస్తూ ప్రజల దీవెనలను పొందుతున్నారు.

**పెరుగుతున్న మహిళల మద్దతు..**
వార్డు ప్రచారంలో భాగంగా తనకు మహిళల నుండి అనుకూలంగా మద్దతు లభిస్తుందని ముఖ్యంగా యువత ముందుకు వచ్చి స్వచ్ఛందంగా ప్రచారం చేస్తుండడం తన అదృష్టంగా భావిస్తున్నానని ఆమె అన్నారు. ఏ ఇంటికి వెళ్లిన తనను ఆడపడుచు వలె ఆదరిస్తున్నారని వాళ్ళ అభిమానాన్ని చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు.

**వార్డులో ప్రచార జోరు..**
మొరిశెట్టి నివేదిత తనదైన శైలిలో ప్రతి ఇంటి ఆడబిడ్డకు బొట్టు పెడుతూ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ అభ్యర్థి కావడంతో తమ వార్డు నుండి మహిళ చైర్ పర్సన్ ఎంపిక చేయడం పట్ల వార్డు మహిళలు కాంగ్రెస్ అధిష్టానానికి ఏఐసీసీ సభ్యులు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డికి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

**అభివృద్ధి సంక్షేమ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం..**
అభివృద్ధి సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. గత ప్రభుత్వాలు అభివృద్ధిని కుంటుపరిచాయని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధిని సాధిస్తుందని అన్నారు. వార్డు ప్రజల మద్దతుతో 44 వ వార్డులో తప్పక విజయం సాధిస్తానని అన్నారు.



# భవిష్యత్ తరాలకు.. శుభ్రమైన ప్రపంచాన్ని నిర్మిద్దాం

### హైదరాబాద్ బిట్స్ పిలాని క్యాంపస్‌లో అంతర్జాతీయ నావెల్ మెటీరియల్స్‌పై సమావేశం

### 250 మందికి పైగా పాల్గొన్న పరిశోధకులు పరిశ్రమ ప్రతినిధులు

### ముఖ్యఅతిథిగా డిఎంఎస్ఆర్ డిఈఅ, డిఆర్‌డిఓ డైరెక్టర్ డాక్టర్ కింగ్స్ ముకోపాధ్యాయ్





**జవహర్‌నగర్, ఫిబ్రవరి 7 (నినాదం):** కాలుష్య తమవుతున్న ప్రపంచంలో కొత్తరకం రోగాలతో మానవుడు అతలాకుతలం అవుతున్నాడని శక్తితోనే శక్తివంతమైన పదార్థాలను తయారుచేసి భవిష్యత్ తరాలకు శుభ్రమైన సమాజాన్ని అందిద్దామని పరిశోధకులకు డిఎంఎస్ ఆర్‌డి ఈడి ఆర్‌డిఓ డైరెక్టర్ డాక్టర్ కింగ్స్ ముకోపాధ్యాయ పిలుపు నిచ్చారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జవహర్‌నగర్‌లోని బిట్స్ పిలాని ప్ క్యాంపస్ లో కెమికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో శనివారం మూడవ అంతర్జాతీయ నావెల్ మెటీరియల్స్ టెక్నాలజీ పై సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కింగ్స్ ముక్కోపాధ్యాయ హాజరై మాట్లాడుతూ ఇంటెలిజెన్స్ ఆధారిత మెటీరియల్ తో ఇంజనీర్లు పూర్వ గతిని సాధించాలని రసాయన పదార్థాలతో డొమైన్లు తయారు చేయాలని అన్నారు. వేస్ట్ టు ఎనర్జీతో పునరుత్పత్తి సాధించి ప్రత్యేకతను చాటాలని యువ శాస్త్రవేత్తలు ఉన్నతంగా ఆలోచన చేయాలని పేర్కొన్నారు. సదస్సుకు 250 మందికి పైగా పరిశోధకులు పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కులకర్ణి, వెంకటగిరి, యాదవల్లి, ఆసిఫ్ దాస్, నాగేంద్రబాబు, బిట్స్ పిలాని సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అధునాతన ల్యాప్రోస్కోపిక్ గైనకాలజీ శస్త్ర చికిత్స

## ముందస్తుగా వైద్య పరీక్షలు చేయించుకోవాలి

## డాక్టర్ జ్యోత్స్న




**మిర్యాలగూడ ఫిబ్రవరి 7 (నినాదం):** అధునాతన ల్యాప్రోస్కోపిక్ గైనకాలజీ శస్త్ర చికిత్సతోభారీ గర్భాశయ ఫైబ్రాయిడ్ ను విజయ వంతంగా యశోదా హాస్పిటల్స్ వైద్యబృందం నేతృత్వంలో తొలగించడం జరిగిందని మలక్ పేట యశోద ఆసుపత్రి స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ జ్యోత్స్న తెలిపారు. శనివారం నల్గొండ జిల్లా మిర్యాలగూడ ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. 40 ఏళ్లు పైబడిన మహిళలకు గర్భాశయ ఫైబ్రాయిడ్లు ఏర్పడుతున్నాయని వీటిని ప్రతి సంవత్సరం వైద్య పరీక్షలు నిర్వహించుకోవడం వలన ఆరోగ్య సమస్యలు లేకుండా చూసుకోవచ్చు అని అన్నారు. ఫైబ్రాయిడ్లు ఏర్పడినట్లయితే ముందుగా క్యాన్సర్ టెస్ట్ కు శాంపిల్ పంపించి నిర్ధారణ అయ్యాక క్యాన్సర్ లేనివారికి కేవలం ఫైబ్రాయిడ్లు మాత్రమే తొలగించడం జరుగుతుందని క్యాన్సర్ ఉన్నట్లయితే గర్భాశయం తొలగించాల్సి ఉంటుందనిసూచించారు. మారుతున్న ఆహారపు అలవాట్ల వలన జన్యు సమస్యల వలన ఈ ఫైబ్రా ఇడ్లు ఏర్పడే అవకాశం ఉంటుందని వీటిని సరైన సమయంలో గుర్తించి చికిత్స చేయించుకుంటే ఎటువంటి ముప్పు ఉండదని తెలిపారు. ఈ శిబిరంలో 50 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డైరెక్టర్ గోరుకంటి పవన్ యూనిట్ హెడ్ కె .శ్రీనివాస్ రెడ్డి అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర,పి ఆర్ ఓ వాసు కిరణ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# ఏఈఓ నిర్లక్ష్యంతో ఖానాపురం రైతుల అవస్థలు



**కోదాడ, ఫిబ్రవరి 7(నినాదం):** ఖానాపురం గ్రామంలో ఏఈఓ అందుబాటులో లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యూరియా యాప్‌కు సంబంధించిన సాంకేతిక సమస్యలపై సంప్రదించినా ఏఈఓ వినోద్ ఫోన్‌లకు స్పందించడంలేదని రైతులు వాపోతున్నారు., ఉపసర్పంచ్ జగన్ మాట్లాడుతూ... యాప్ టెక్నికల్ సమస్యలపైపలుమార్లు ఫోన్ చేసినా ఎలాంటి స్పందన లేదని తెలిపారు. ప్రజా ప్రతినిధిని నాకే స్పందించకపోతే గ్రామంలో సామాన్య రైతుల పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నించారు. తక్షణమే మండల వ్యవసాయ అధికారులు వెంటనే చొరవ చూపాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# బీఆర్ఎస్ వైపే ప్రజల అడుగులు





**సూర్యాపేట ప్రతినిధి ఫిబ్రవరి 7 (నినాదం):** వార్డులో టిఆర్ఎస్ పార్టీ వైపే ప్రజలు అడుగులు వేస్తున్నారని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్ అన్నారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా 22వ వార్డు అభ్యర్థి మోత్కూరి దుర్గమ్మ తరపున ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి కేవలం టిఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారని అందుకు తగ్గట్టుగా స్పందిస్తున్నారని తెలిపారు. వార్డు అభివృద్ధి కోసమే మోత్కూరి దుర్గమ్మ రాజకీయాల్లోకి వచ్చిందని ఆమెకు వార్డు ప్రజలు పూర్తిస్థాయి మద్దతు తెలపాలని కోరారు. మాజీ మంత్రి సూర్యాపేట శాసనసభ్యులు జగదీశ్ రెడ్డి పార్టీలకతీతంగా అభివృద్ధి చేశారని గుర్తు చేశారు.

# మరిపెడ మున్సిపాలిటీ బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించండి

## తెలంగాణ రాష్ట్రంలో వచ్చేది బిజెపి

## మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు

## దేశ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమైంది

## కార్గిల్ సొసైటీ చైర్మన్ గాదే రాంబాబు



**డోర్నకల్/మరిపెడ ఫిబ్రవరి 07(నినాదం):** మరిపెడ మున్సిపాలిటీ బిజెపి పార్టీ కౌన్సిలర్ అభ్యర్థుల గెలుపు కోసం మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు ఇంటింటా తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. మరిపెడ మున్సిపాలిటీ అభివృద్ధిలో వెనుకబడిందని కాంగ్రెస్,బీఆర్ఎస్ ప్రభుత్వం మున్సిపాలిటీ అభివృద్ధిని పట్టించుకోవడం లేదన్నారు. దేశంలో నరేంద్ర మోడీ హవా నడుస్తుందని,మరిపెడ మున్సిపాలిటీ బిజెపి అభ్యర్థులను గెలిపిస్తే మున్సిపాలిటీ అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం జీఎస్టీని తగ్గించడంతో వ్యాపారస్తులు ఎంతో సంతోషిస్తున్నారన్నారు. కష్టమర్లు కూడా అనేక వస్తువులపై జిఎస్టి తగ్గించడంతో తక్కువ ధరకే వస్తువులను కొనుగోలు చేస్తున్నరన్నారు. త్వరలో వచ్చే ఎమ్మెల్యే ఎన్నికలలో అధిక స్థానాలను గెలుచుకొని తెలంగాణ రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందనే ధీమను వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకు అండగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వల్లబు వెంకటేశ్వర్లు,రాష్ట్ర నాయకులు గాదె రాంబాబు,చీకటి మహేష్ జిల్లా ప్రధానకార్యదర్శి,ఇవి రమేష్ మున్సిపాలిటీ ఇంచార్జి,కే ఉపేందర్ సహ ఇంచార్జి,శ్యామ్ రాథోడ్ ఎస్టీ మోర్చా రాష్ట్ర ఇంచార్జ్,కట్టోజు గంగాధర్ మండల అధ్యక్షులు మరిపెడ, పట్టణ అధ్యక్షురాలు మంగమ్మ, జిల్లా నాయకులు బుల్లెట్ కృష్ణ,బిజెపి మరిపెడ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థులు,పార్టీ నాయకులు ఇంకా తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలే అభ్యర్థులను గెలిపిస్తాయి

## • ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్



**డోర్నకల్/మరిపెడ ఫిబ్రవరి 07(నినాదం):** మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని ఐదో వార్డ్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి బోడ రవి గెలుపు కోసం ఎమ్మెల్యే రామచంద్రనాయక్ ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరాలంటే బోడ రవి ని గెలిపించాలని కోరారు. మహిళలకు ఉచిత బస్సు,200 యూనిట్ల ఉచిత విద్యుత్తు,రైతు రుణమాఫీ మాఫీ చేయడం జరిగిందన్నారు. ప్రజలకు నేరుగా ప్రభుత్వ పథకాలు చేరాలంటే కాంగ్రెస్ అభ్యర్థులనే గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు యుగంధర్ రెడ్డి, మండల అధ్యక్షులు రఘువీరారెడ్డి,పట్టణ అధ్యక్షులు తాజుద్దీన్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గుగులోత్ రవి నాయక్,కాంగ్రెస్ నాయకులు నూకల అభినవ్ రెడ్డి, గంధసిరి అంబరీష,నల్లు శ్రీకాంత్ రెడ్డి,పాంగోత్ రాంలాల్,లక్ష్మీపతి, సర్పంచ్ కర్ణ నాయక్,నాగ నాయక్,కాంగ్రెస్ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# జవహర్‌నగర్‌లో.. ఏరులై పారుతున్న మురుగునీరు





## మురుగు... పరుగు... కంపు కనుమరుగయ్యేదెప్పుడు?

## డ్రైనేజీ లేక ఇక్కట్లు పడుతున్న పలు కాలనీవాసులు

## వైతరణి నదికి చిరునామా.. పాపయ్యనగర్ రహదారి?

**జవహర్‌నగర్, ఫిబ్రవరి 7 (నినాదం):** బృహత్ మహానగర పరిధిలోని కీసరసర్కిల్ లోని జవహర్ నగర్ లో పలు కాలనీలు మురుగు నీటితో చెత్తాచెదారంతో దర్శనమిస్తున్నాయి. దోమలతో ఈగలతో సహవాసం చేస్తున్నామని జవహర్ నగర్ కాలనీవాసులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. జవహర్ నగర్ లో మొత్తం కాలనీలు 100కు పైగా ఉండగా, కాలనీలకు మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని ముఖ్యంగా డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ వ్యవస్థ, సక్రమంగా లేక ప్రజలు నిత్యం నరకం అనుభవిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా జవహర్ నగర్ లోని పాపయ్య నగర్ కి వెళ్లే దారిలో మురుగునీరుతో ఈగలు, దోమల బెడదతో ఆసుపత్రుల పాలు కావాల్సిందేనా? అని ప్రజలు తమ బాధను వెల్లబోసుకుంటున్నారు. వానాకాలంలో మురుగునీటి వల్ల పందులు, దోమలు, ఈగలు, స్వైర విహారం చేస్తున్నాయని ప్రజలు తమ ఆవేదనను వెళ్ళబోసుకున్నారు. పాపయ్య నగర్ కాలనీ, సంతోష్ నగర్, సుక్కమ్మ కుంట, బి జె ఆర్ నగర్ కాలనీ, కేఎన్ఆర్ కాలనీ, నాచారం ఫైర్విక్టింగ్ కాలనీ, దోబీ ఘాట్, దొండ తోట, తదితర కాలనీల వైపు వెళ్లాలంటే జనం ముక్కు మూసుకోవా ల్సిందేనా? జవహర్ నగర్ పాపయ్య నగర్‌కు వెళ్లే దారులు మరీ ఎక్కువగా మురుగునీరు చెత్తాచెదారంతో కంపు తో చెరువులను తలపిస్తున్నాయని కాలనీవాసులు పేర్కొంటున్నారు. నిల్వ ఉన్న మురుగునీరు కలుషితమై రసాయనాలుగా తయారై ప్రజలకు ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయి. కాలనీల ప్రజలు దుర్వాసనను భరించలేక రోగాల పాలవుతున్నారు. నిత్యం వేలాదిమంది ప్రజలు పనుల కోసం పట్టణాలకు వెళ్ళేది ఈ దారి గుండానే . మురుగునీరు వల్ల దుర్వాసన భరించలేక ముక్కు మూసుకుని పోతుంటే ఊపిరి ఆడనంత పని అవుతుందని, వానాకాలం ముగిసినా మురుగునీటిని బయటకు పంపేందుకు అధికారులు చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. ములిగే నక్క మీద తాటిపండు పడ్డ చందంగా అసలే డంపింగ్ యార్డ్ వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా దీనికి తోడు జవహర్ నగర్ లోని అనేక కాలనీలు మురికినీటికి ఆవాసాలుగా మారాయని ప్రజలు తమ బాధను మీడియా ముందు వెళ్ళబోసుకున్నారు. రాబోయే వర్షాకాలంలో ప్రజలకు వ్యాధులు సంభవించక ముందే అధికారులు మేల్కొని ప్రజలకు యుద్ధ ప్రాతిపదికన తక్షణమే చర్యలు చేపట్టి మురుగునీరు బాధ నుండి ప్రజలను, వ్యాధుల బాధనుండి ప్రజలను రక్షించి ఆరోగ్యవంతమైన సమాజానికి తోడ్పాలని ప్రజలు వేడుకుంటున్నారు.



# బీఆర్ఎస్‌తోనే మరిపెడ మున్సిపాలిటీ అభివృద్ధి





## కాంగ్రెస్ పార్టీకి ఓటు అడిగే హక్కు లేదు

## బీఆర్ఎస్ నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి

## మార్పు పేరుతో మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

## మాజీ మంత్రి రెడ్యానాయక్

**డోర్నకల్/మరిపెడ ఫిబ్రవరి 07(నినాదం):** తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని ధన్యగార రాష్ట్రంగా మార్చారని డోర్నకల్ నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. మరిపెడ మున్సిపాలిటీలోని 2 వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థి బానోత్ భద్రమ్మ శ్రీను,3 వ వార్డ్ బానోత్ కిషన్,4 వ వార్డ్ బల్లెం సురేష్,5 వ వార్డ్ బోడ భాస్కర్, 6 వ వార్డ్ కౌన్సిలర్ జాటోత్ కౌసల్య గణేష్ నాయక్,వార్డులలో ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ఇంచార్జ్ బిఆర్ఎస్ నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రజలకు తులం బంగారం,2500 వందల మహాలక్ష్మి,విద్యార్థులకు స్కూటీ,విద్యా భరోసా లాంటి పథకాలు ఎన్నో ఇస్తానని అబద్దాలతో అధికారంలోకి వచ్చింది తప్ప,ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలో ప్రజలకు ఓట్లు అడిగే హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదన్నారు. మరిపెడ మున్సిపాలిటీలో అభివృద్ధి పై డాక్యుమెంటరీ పట్టణ ప్రజల సమక్షంలో ప్రారంభించడం జరిగిందన్నారు. ఏలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేశామో పట్టణ ప్రజలకు తెలుసు అన్నారు. మరిపెడ మున్సిపాలిటీకి తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలోనే చర్చ జరిగిందన్నారు. ఇండోర్ స్టేడియం,పార్కులు, సెంట్రల్ లైటింగ్ ఇలాంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు,మాజీ ఎంపీపీ గడ్డం వేంకన్నా,బీఆర్ఎస్ నాయకులు కాలు నాయక్,గుగులోత్ రాంబాబు,తేజవత్ సక్రం నాయక్,పనుగోత్ వేంకన్నా,వీరన్న,డీజె చరణ్,వేంకటేశ్వర్లు, శంకర్,బీఆర్ఎస్ నాయకులు,మహిళాలు ఇంకా తదితరులు పాల్గొన్నారు.

# వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించండి

## • వార్డుల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతో సాధ్యం..

## • ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్



**డోర్నకల్/మరిపెడ ఫిబ్రవరి 07(నినాదం):** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని 8 వ వార్డులో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి విసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి గెలుపు కోసం డోర్నకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రు నాయక్ కూన్య తండా లో రోడ్ షో నిర్వహించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. 8 వ వార్డులోని ప్రజలను నేరుగా కలుస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు నేరుగా ప్రజలకు చేరాలంటే కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కౌన్సెలర్ లను గెలిపించు కోవాలన్నారు. వార్డుల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం మరిపెడ మున్సిపాలిటీ అభివృద్ధికి కట్టుబడి ఉందని తెలిపారు. 8వ వార్డు వార్డు అభివృద్ధికి కృషి చేస్తామని,విసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని,8 వ వార్డు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వార్డులో ఉన్న ప్రజా సమస్యలను తమ సొంత సమస్యలుగా భావించి ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,ఉచిత విద్యుత్,ఇంటింటికి సన్న బియ్యం,కళ్యాణ లక్ష్మి, రైతులకు రుణమాఫీ, క్వింటాకు 500 రూపాయల బోనస్, వంటి పథకాలు అద్భుతంగా అమలవుతున్నాయని, ఈ అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. వారి వెంట జిల్లా కాంగ్రెస్ నాయకులు యుగంధర్ రెడ్డి, మండల అధ్యక్షులు రఘువీరారెడ్డి, పట్టణ అధ్యక్షులు తాజుద్దీన్, కాంగ్రెస్ నాయకులు అభినవ్ రెడ్డి,నల్లు శ్రీకాంత్ రెడ్డి,పాంగోత్ రాంలాల్,అలవాల ఉపేందర్ ప్రజాపతి, గంధసిరి బిక్షపతి, గంధసిరి అంబరీష, కారంపూడి ఉపేందర్, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టులపై దాడి ప్రజాస్వామ్యంపై దాడే..

## • మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

**కోదాడ, ఫిబ్రవరి 7(నినాదం):** కోదాడ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను మద్యం, ధన ప్రలోభాలతో ప్రభావితం చేస్తున్న కాంగ్రెస్ నాయకుల అక్రమాలను వీడియోల్లో చిత్రీకరిస్తున్న జర్నలిస్టులపై కాంగ్రెస్ గూండాలు బహిరంగంగా దాడి చేయడం అత్యంత హేయమైన, నీచమైన చర్య అని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ కోదాడ నియోజకవర్గ నాయకుడు బొల్లం మల్లయ్య యాదవ్ తీవ్రంగా ఖండించారు. ప్రజలకు నిజాలు తెలియకూడదనే భయంతోనే మీడియా గొంతు నొక్కే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కోదాడ నియోజకవర్గంలో జర్నలిస్టులపై జరిగిన ఈ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నానని, దాడికి పాల్పడిన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖను ఆయన డిమాండ్ చేశారు. మీడియా స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, జర్నలిస్టులకు పూర్తి భద్రత కల్పించాలని బొల్లం మల్లయ్య యాదవ్ కోరారు.





# విపక్షంగా కాంగ్రెస్ వైఫల్యం

**దేశంలో రాజకీయ నేతలు బానిస భాజాలంతో బతుకుతున్నారు. అధికారపక్షంపై బట్టకాల్చి మీద పడేస్తే.. తరవాత అధకారం మనదే అన్న ధోరణిలో ఉన్నారు. ఎవరి లక్ష్యమైనా అధికారమే. అధికారంలో ఉన్నవారు దానిని కాపాడుకునే ప్రయత్నం..లేనివారు అధికారంలోకి వచ్చే ప్రయత్నాల్లో విన్యాసాలు చేస్తున్నారు. తాజాగా ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఎవరి పేరుందో వెతికి మరీ విమర్శలకు దిగుతున్నారు. కాంగ్రెస్, కమ్యూనిస్టులు ఇందులో ముందున్నారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతన్న వేళ సమస్యలపై పోరాటం ఆపేశారు. ప్రజల పక్షాలన పోరాడలేక చతికిల పడ్డారు. పార్లమెంట్‌కు రావడం గోల చేయడం, వాకౌట్ చేయడం ఇదీ విపక్షాలు అలవాటు చేసున్న నమూనా. అధికార బిజెపి ఏదయితే కోరుకుంటుందో అదే చేస్తున్నారు.**

ఎడిటోరియల్

మనదేశంలో జరిగిన దారుణ ఘటనలకు సంబంధించి కాశ్మీర్ ఫైల్స్, కేరళ ఫైల్స్‌పై చర్చ అసవరం లేదు. దేశంలో జరుగుతున్న సమస్యలపై చర్చ పట్టదు. ఉపాధిపతకానికి గాంధీ పేరు తొలగించారని ఆందోళన చేస్తారు. ఇది ప్రజలకు కూడాగుడ్డా పెట్టేది కాదు. నిజానికి ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో రాహుల్ ఓ అసమర్థ నేత అని ఉంది. అది నిజమే అన్నట్లుగా గత పదేళ్లుగా రాహుల్ ప్రజల సమస్యలపై ఒక్కటంటే ఒక్క పోరాటం చేయలేదు. పార్లమెంట్‌లో పోరాడడం లేదు. నాయకత్వ లక్షణాలను పుణికిపుచ్చుకోవడం లేదు. అందుకే కాంగ్రెస్ పార్టీకి ఏమైంది అన్న ఆందోళన కలుగుతోంది. నాయకత్వ సమస్య ఈ పార్టీని పట్టిపీడిస్తున్నది. సుదీర్ఘ కాలం అధికారంలో కొనసాగిన ఆ పార్టీ నాయకత్వం ఇప్పుడు వెలవెలబోవడానికి కారణం కేవలం రాహుల్ అన్నదే గుర్తించాలి. కాంగ్రెస్ పార్టీ జవసత్వాలు పొందడానికి కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు రాహుల్ పాదయాత్ర చేసి ఇప్పుడేమో అచేతనంగా ఉండిపోయారు. పార్టీ జవసత్వాలు కోల్పోవడానికి ఆ పార్టీ నాయకత్వం అనుసరిస్తున్న విధానాలే కారణమని వేరుగా చెప్పాల్సిన పనిలేదు. నవతరం ఆశిస్తున్నది ఏమిటో గుర్తించి అందుకు అనుగుణంగా పార్టీని తీర్చిదిద్దడంలో, విధానాల రూపకల్పనలో కాంగ్రెస్ నాయకత్వం పూర్తిగా విఫలమవుతోంది. వరుస ఓటములతో పార్టీ భవిష్యత్తు మసకబారిన సమయంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసేందుకు కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ పెద్దగా కార్యాచరణ చూపడం లేదు. మోడీ వైఫల్యాలను ఎండగట్టడానికి పార్లమెంట్ మంచి వేదిక. పార్లమెంటులో వివిధ అంశాలను లేవనెత్తి వాటిపై చర్చించే అవకాశం ఉంటుంది. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం కావచ్చు, బడ్జెట్ ప్రసంగం కావచ్చు...వీటిపై చర్చలో ప్రభుత్వ విధానాలను ఏకిపారేయవచ్చు. కానీ దానిని ఉపయోగించుకోవడంలో విపక్షనేతగా రాహుల్ పూర్తిగా విఫలం అయ్యారనే చెప్పాలి. సంబంధం లేని మాజీ ఆర్మీ చీఫ్ నరవాణెళి రాతలను ప్రస్తావిచడం ద్వారా అభాసుపాలయ్యారు. ఎందుకంటే ఆ పుస్తకం ఇంకా అచ్చు కాలేదు. ఇలా వరుస వైఫల్యాలను చూసిన తరవాత కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తు ఉంటుందన్న నమ్మకం కలగడం లేదు. 75 ఏళ్లకు చేరువలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పోటీపడటంలో 50 ఏళ్లు పైబడిన రాహుల్‌గాంధీ ఎందుకు వెనుకబడుతున్నారు. ప్రజలు ఏమి కోరుకుంటున్నారన్నది పట్టించుకోవడం లేదు. వారి ఆలోచన ల్లో వచ్చిన మార్పు ఏమిటి అన్నది పసిగట్టలేకపోవడమే కారణంగా కనిపిస్తోంది. ప్రజల ఆలోచనల్లో వస్తున్న మార్పును గుర్తించడానికి నిరాకరిస్తూ తుప్పు పట్టిన భావజాలాన్నే కొనసాగించడం వల్లనే కమ్యూనిస్టు పార్టీలు అంతరానం అయ్యాయి. వారు ఇప్పటికీ అది గమనించడం లేదు. అమెరికాతో ఒప్పందాన్ని కూడా వ్యతిరేకించడమంటే అంతకు మించిన దౌర్భాగ్యం మరోటి లేదు. ప్రపంచంలో మనదేశం మనుగడ సాగించాలంటే ఒప్పందాలు తప్పవు. ట్రంప్ బెదిరింపుల కారణంగా ఇంతకాలం మోడీ నిశ్శబ్దంగా ఉన్నారు. ఇప్పుడు ఒప్పందానికి ఓకే చెప్పిన తరవాత కాంగ్రెస్, కమ్యూనిస్టులు విమర్శలు చేస్తున్నారు. ఇదే వారి నాయకత్వ లోపానికి, అంతర్జాతీయ అవగాహన లేదనడానకి నిదర్శనంగా చూడాలి. ప్రపంచీకరణ కారణంగా కష్టపడే వారికి ఉపాధి అవకాశాలకు కొదవ లేదు. జీవన ప్రమాణాలు కూడా మెరుగుపడ్డాయి. ఫలితంగా మనవాళ్లు ఏదేశమైన వెళ్లి పనిచేసుకో గలుగుతున్నారు. రాజకీయ పార్టీలు ప్రపంచ పరిణామాలకు అనుగుణంగా సాగాలి. అవి మన ప్రజలకు ఎలా ఉపయోగమో ఆలోచన చేయాలి. అలా చేయకపోవడం వల్లనే కాంగ్రెస్, కమ్యూనిస్టులు కాలక్రమంలో మెజారిటీ ప్రజలకు దూరమయ్యారు. యువతరానికి పూర్తిగా దూరమయ్యారు. కాంగ్రెస్ పార్టీలో ఆలోచనా పరులు లోపించారు. ఒకరిద్దరు రాహుల్‌ను కంట్రోల్ చేస్తున్నారు. అందుకే ఆయన ఆలోచనలు ఎంతసేపు మోడీని దింపడమెలా అన్న ధోరణిలో సాగుతున్నారు. మోడీని దింపేముందు మోడీ పనులను నిలదీఏ ప్రయత్నాలు చేయడం లేదు. మోడీని దోషజగా నిలబెట్టే యత్నాలు చేయడం లేదు. తొలి తరం కాంగ్రెస్ నాయకత్వం అప్పటి పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వ రంగాన్ని ప్రోత్సహించింది. ఆ తర్వాత దశలో ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా పైవేటీకరణను ప్రోత్సహించారు. పివి నరసింహారావు సంస్కరణ పుణ్యమా అని ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే పేదల సంక్షేమం చేపట్టవచ్చని నమ్మారు. సుదీర్ఘకాలం అధికారంలో కొనసాగి, మళ్లీ అధికారంలోకి రావాలనుకుంటున్న పార్టీ నాయకుడి చర్యలు కాలానుగుణంగా ఉండడం లేదు. ముత్తాత జవహర్‌లాల్ నెహ్రూ, నాయనమ్మ ఇందిరాగాంధీ, తండ్రి రాజీవ్‌గాంధీ, పివి నరసింహారావు, మన్మోహన్ సింగ్‌లు అనుసరించిన విధానాలను రాహుల్‌గాంధీ అధ్యయనం చేయకపోవడం వల్ల దౌర్భాగ్యంగా చూడాలి. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ ప్రజల మనోభావాలకు అనుగుణంగా వ్యూహ రచన చేస్తూ భారతీయ జనతా పార్టీని విజయపథంలో నిలబెడుతున్నారు. '75 ఏళ్ల వయసులో కూడా ప్రధాని మోదీ యువతను ఆకర్షించడానికి కారణం ఏమిటన్నది ఆలోచన చేస్తున్నారు. కాంగ్రెస్ తన నాయకత్వ పటిమను బలపర్చుకోకుంటే రాణించడం కలష్టమన్న విషయం రాహుల్ ఎంత తొందరగా గుర్తిస్తే అంతమంచిది.

# నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే.. కాంగ్రెస్‌ను గెలిపించండి!

## పురపోరులో.. రాజకీయ వ్యభిచారం..!

**జగిత్యాల ప్రతినిధి, ఫిబ్రవరి 7 (నినాదం)**

జగిత్యాల, రాయికల్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో విచిత్రమైన సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఫిరాయింపు ఎమ్మెల్యేల పుణ్యమా అని రాజకీయాల పూర్తిగా భ్రస్టు పట్టిపోయాయి. గత 15 ఏళ్లుగా టిఆర్ఎస్ లో ఉన్న నాయకులు అర్జెంటుగా కాంగ్రెస్ కండువా కప్పుకొని పురపోరులో ఓట్లు అడుగుతున్నారు . నియోజకవర్గ ఎమ్మెల్యే కూడ నేను పక్కా టిఆర్ఎస్ ఎమ్మెల్యేని కానీ కాంగ్రెస్‌ను గెలిపించండి అంటూ ప్రచారం చేయడం పట్ల మేధావులు రాజకీయ విశ్లేషకులు ఈ తరహా రాజకీయాలను అసహ్యించుకుంటున్నారు. కేవలం డబ్బు మాయలో పడ్డ ఓ శాసనసభ్యులు ఇంతటి రాజకీయ వ్యభిచారానికి ఒడిగట్టడం పట్ల తీవ్ర విమర్శలు వెళ్ళివెత్తుతున్నాయి. గత రెండు సంవత్సరాల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వంతో అంటగాగిన ఎమ్మెల్యే కాంట్రాక్టు పనుల పేరుతో అడ్డగోలు డబ్బులు కూడా పెట్టి ఈ మున్సిపల్ ఎన్నికల్లో వెదజల్లి గెలుపొందే ప్రయత్నం చేస్తున్నారని విమర్శలు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ నైతికతను పూర్తిగా కోల్పోయి ఎవరు గెలుపు వైపు ఉంటే వారి మెడలో కండువా వేసి గెలిపించండి అంటూ రాజ్యాంగ హక్కులను తుంగలో తొక్కుతున్నారనే విమర్శలు వినపడుతున్నాయి. జగిత్యాల రాయికల్ మున్సిపాలిటీలో వార్డు కౌన్సిలర్ గా పోటీ చేస్తున్న అభ్యర్థులు చాలామంది ఎవరు ఏ పార్టీ వారు తెలుసుకోలేని దుస్థితి నెలకొంది. టిఆర్ఎస్ ఎమ్మెల్యే మెడలో ఏ కండువా లేకుండానే టిఆర్ఎస్ ఎమ్మెల్యేని అని చెప్పుతూ చట్టానికి దొరకకుండా ప్రజలను మోసం చేస్తూ ఎన్నికల ప్రచారం చేయడం పట్ల తీవ్రమైన విమర్శలు వెళ్లిపోతున్నాయి. నేను టిఆర్ఎస్ ఎమ్మెల్యే నే కాంగ్రెస్ పార్టీని గెలిపించండి అంటూ వింత ప్రచారం చేయడం పట్ల మున్సిపల్ ఓటర్లు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇంతటి దిగజారుడు రాజకీయాలను మేము ఎప్పుడూ చూడలేదు అంటూ వాపోతున్నారు. మరి కొంతమంది కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో దొంగలు పడి చేతి గుర్తును ఎత్తుకెళ్లారని అందుకే ఇండిపెండెంట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రచారం చేసుకుంటున్నారు . 40 ఏళ్లు పార్టీని పట్టుకొని ఉన్న మాజీ మంత్రి జీవన్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ తీవ్రమైన అన్యాయం చేసిందని ప్రచారం చేసుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ ఉంచుకున్న దాని మోజులో పడి కట్టుకున్న దాన్ని ఆగం చేసిందని వ్యంగ్యాస్త్రాలు విసురుతున్నారు. రాజకీయ పార్టీలను అస్థిరతపరిచే దుర్మార్గమైన చర్యలకు పాల్పడుతున్నారు అంటూ విమర్శలు చేస్తున్నారు



సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నా ఎమ్మెల్యే ఫొటో

ఫిరాయింపు ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ పార్టీకి ఏం లాభం జరిగిందో తెలియదు కానీ క్షేత్ర స్థాయిలో తన పతనాన్ని తానే రచించుకున్నదని విమర్శలు ఊపందుకున్నాయి . జగిత్యాల నియోజకవర్గం లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు జీవన్ రెడ్డి ముఖ్యమంత్రి స్థాయి అలాంటి లీడర్‌కు సమాచార ఇవ్వకుండా బి ఆర్ ఎస్ ఎమ్మెల్యేలు పార్టీలోకి ఆహ్వానించడం పట్ల ఈ ప్రాంత కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేకపోయారు. దీంతో గత సంవత్సరం నుంచి తీవ్రమైన రాజకీయ పోరాటం నడుస్తుంది. ప్రస్తుతం రాయికల్ జగిత్యాల మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఓటర్ల సానుభూతి పొందడంలో సక్సెస్ అయ్యారనే చర్చ నడుస్తుంది.. కిరాయింపు ఎమ్మెల్యే సారథ్యంలో డబ్బులు వెదజల్లి గెలుపొందే పథకాలు రచిస్తున్నట్టు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. డబ్బులు ఎవరిచ్చిన తీసుకొని ఒరిజినల్ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఇండిపెండెంట్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు. జగిత్యాల నియోజకవర్గం లో జరుగుతున్న ఈ వింత ప్రచారాన్ని సోషల్ మీడియా డిటిజన్లు ఆసక్తిగా గమనిస్తున్నారు.

## యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిబంధనలు–2026

# వెంటనే అమలు జరపాలి

## సుప్రీం కోర్టు విధించిన స్టే ను వెంటనే ఎత్తివేయాలి: పూర్వ విప్లవ విద్యార్థుల వేదిక

భారతదేశంలోని ఉన్నత విద్యా వ్యవస్థలో కుల వివక్ష, అవమానం, బహిష్కరణలకు వ్యతిరేకంగా విద్యార్థులు సాగించిన దీర్ఘకాలిక పోరాటాల ఫలితంగానే యూజీసీ (ఉన్నత విద్యా సంస్థల్లో సమానత్వ ప్రోత్సాహం) నిబంధనలు–2026 రూపుదిద్దుకున్నాయి. గత రెండు దశాబ్దాలుగా దేశవ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాల్లో చోటుచేసుకున్న వివక్ష ఘటనలు, విద్యార్థుల ఆత్మహత్యలు, నిరంతర నిరసనలు, ఫ్యాక్ట్–ఫైండింగ్ కమిటీల నివేదికలు—ఈ అన్నిటి నేపథ్యంలోనే 2012లో వివక్ష నిరోధక మార్గదర్శకాలు వచ్చాయి. అయితే అవి సలహా స్థాయిలోనే ఉండిపోయాయి. వాటిని అమలు పరచాల్సిన బాధ్యతను సంస్థలపై ఉంచలేదు.

ఆ మార్గదర్శకాలు వచ్చిన తరువాత కూడా యూనివర్సిటీల్లో, విద్యా సంస్థల్లో వివక్ష ఆగలేదు. అందువల్ల ఈ పరిమితులను అధిగమించాల్సిన అవసరం నుంచే 2026 నిబంధనలు రూపుదిద్దుకున్నాయి. ఇవి సమానత్వాన్ని నైతిక ఉపదేశంగా కాకుండా, సంస్థాగత బాధ్యతగా నిర్వచిస్తాయి. ప్రతి విశ్వవిద్యాలయం, కళాశాలలో సమాన అవకాశ కేంద్రాలు, సమగ్ర ప్రతినిధిత్వంతో కూడిన కమిటీలు, స్పష్టమైన ఫిర్యాదు–విచారణ విధానాలు ఏర్పాటు చేయాలని ఈ నిబంధనలు నిర్దేశిస్తున్నాయి. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీలు, మహిళలు, వికలాంగులు వంటి చారిత్రకంగా అణచివేయబడిన వర్గాల విద్యా హక్కులను రక్షించడమే వీటి మూల ఉద్దేశం.

అయితే ఈ నిబంధనలు వెలువడిన వెంటనే అగ్రకుల విద్యార్థులు కొన్ని చోట్ల, ముఖ్యంగా ఉత్తర భారత రాష్ట్రాలలో ఈ నిబంధనలను తీసివేయాలని ఆందోళన చేశారు. మండల్ కమిషన్ సమయంలో కూడా చేసినట్టు ఇప్పుడు కూడా ప్రదర్శనలు చేశారు. ఎస్సి, ఎస్టి, ఓబిసి, మైనారిటీ మత విద్యార్థులు తమ డిమాండ్ల కోసం ఎంత సుదీర్ఘ కాలంగా ప్రదర్శనలు చేసినా పట్టించుకొని ప్రభుత్వం, కోర్టులు కొద్దిమంది అగ్రకుల విద్యార్థులు కొన్ని చోట్ల ప్రదర్శన చేయగానే దొడ్డి దారిన సుప్రీం కోర్టు ద్వారా ఈ నిబంధనలపై ఆగమేఘాలపై స్టే విధించింది. అగ్రకులాలతో నిండిపోవడం వల్ల కోర్టులు పీడిత కులాల పక్షాన ఏమాత్రం నిలబడటం లేదు అన్న విషయాన్ని మరోసారి నిరూపిస్తూ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ యూజిసి నిబంధనలపై స్టే విధించాడు. అసలు బిజేపి అధికారంలోకి వచ్చినప్పటినుండి మనువాద భావజాలానికి విశ్వవిద్యాలయాల్లో పెద్దపీట వేసింది. ఈడబల్యూఎస్ రిజర్వేషన్ల పేరిట 3–4 శాతం ఉన్న అగ్రకులాల వారికి 10 శాతం రిజర్వ్ చేసింది. విద్య కాషాయీకరణ పెద్ద ఎత్తున పెరిగిపోయింది. ఒక వైపు ఇట్లా మనువాద భావజాలాన్ని పెంచుతూ, పీడిత కుల విద్యార్థులపై దాడులకు కారణమవుతూనే మరొకవైపు బహుళ సంఖ్యాకులైన పీడిత కులాలను బుజ్జగించేందుకు ఒక వైపు యూజిసి నిబంధనలు తెచ్చి మరో వైపు సుప్రీం కోర్టు ద్వారా వాటి అమలును ఆపివేయించి కోర్టు మీద నెపం వేసే కుట్రలకు పాల్పడుతున్నది. ఇది బిజేపి కపట ద్వంద్వ నీతిని మరోసారి బయట పెడుతున్నది.




అయితే, ఈ నిబంధనల అమలుపై ఇట్లా స్టే విధించడం పట్ల పూర్వ విప్లవ విద్యార్థి వేదిక తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నది. ఇప్పటికే అనుభవిస్తున్న అసమానతలు, వివక్షలకు ఇది మరింత బలమిచ్చే ప్రమాదం ఉందని మేము భావిస్తున్నాం. అందుకే దేశవ్యాప్తంగా జేఎన్‌యూ, ఢిల్లీ, బనారస్, అలహాబాద్, ఆగ్రా, పాట్నా తదితర విశ్వ విద్యాలయాల్లో విద్యార్థులు ర్యాలీలు, ధర్నాలు, సిట్–ఇన్ నిరసనలు చేపట్టి, ఈ నిబంధనలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. శాంతియుతంగా ఈ నిబంధనల గురించి అలహాబాద్ విశ్వవిద్యాలయ ఆవరణలో చర్చించుకుంటున్న విద్యార్థులపై ఏబివిపి గూండాలు దాడి చేస్తుంటే పోలీసులు కూడా వారికి మద్దతుగా నిలవడం సంఘ్ పరివార్ వైఖరిని, ప్రభుత్వ వైఖరిని బయటపెడుతుంది.

ఈ ఉద్యమాలు ఆకస్మికంగా పుట్టినవి కావు; అవి సంవత్సరాలుగా వివక్షకు గురైన అనుభవాలు, గూడు కట్టుకున్న బాధ, పెరుగుతున్న రాజకీయ చైతన్యాలకు ప్రతిరూపం.

కాబట్టి,

1. యూజీసీ సమానత్వ నిబంధనలు–2026 ను ఎలాంటి ఆలస్యం లేకుండా అమలు చేయాలి.
2. ఉన్నత విద్యా సంస్థల్లో వివక్షకు వ్యతిరేకంగా స్పష్టమైన, బాధ్యతాయుతమైన చట్టబద్ధ వ్యవస్థను నిలబెట్టాలి.

# నిరుద్యోగులకు నకిలీ డిఎస్పీ టోకరా

**ఉద్యోగాల పేరుతో లక్షల్లో వసూళ్లు**

**అరెస్ట్ చేసి విచారిస్తున్న పోలీసులు**

**విశాఖపట్నం, ఫిబ్రవరి7 (నినాదం):**

పోలీస్ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి అమాయకుల నుంచి లక్షలు కొట్టేశాడో దుర్మార్గుడు. చెల్లుబోయిన లోచన కుమార్ అనే వ్యక్తి నకిలీ డీఎస్పీ వేషంలో లక్షల రూపాయల వసూళ్లకు పాల్పడ్డాడు. ఈ వ్యవహారం ప్రస్తుతం.. విశాఖ నగరంలో సంచలనం సృష్టిస్తోంది. 2019 నుంచి 2026 వరకు తాను డీఎస్పీ, ఎస్పీ అని చెబుతూ పలు మోసాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై విశాఖ పోలీసులు సీరియస్‌గా దర్యాప్తు చేపట్టారు. నెల్లూరు డీటీసీ)లో గెస్ట్ ఫ్యాకల్టీగా వెళ్లిన నకిలీ డీఎస్పీ.. పోలీసులకు అడ్డంగా దొరికిపోయాడు. నెల్లూరులో దొరికిన నకిలీ డీఎస్పీని విశాఖపట్నానికి తీసుకువచ్చారు పోలీసులు. గ్రూప్ 1 పరీక్షల్లో సత్తా చాటినట్లు లోచన కుమార్ పలు పత్రికల్లో ఫేక ప్రచారాలు చేశాడు. అతడిపై విశాఖ సిటీ పరిధిలోని ఎయిర్‌పోర్ట్ పీఎస్‌లో రెండు కేసులు, ఎంవీపీ పీఎస్, మల్కాపురం పీఎస్, ఫోర్త్ టౌన్ పీఎస్‌లలో చీటింగ్, ఎక్స్‌టార్షన్, జాబ్ ఫ్రాడ్ వంటి కేసులపై ఎఫ్ఐఆర్ నమోదయ్యాయి. సివిక సెంటర్ ఐఏఎస్ అకాడమీలో శిక్షణ తీసుకున్నట్లు సోషల్ మీడియాలో బిల్డప్ ప్రచారాలకు దిగాడు. లోచన కుమార్ మోసాలపై విశాఖపట్నం పోలీసులు విచారణ చేపట్టారు. నకిలీ డీఎస్పీ లోచన కుమార్ మోసాలపై విశాఖపట్నం నగర పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇతనికి సహకరించిన వ్యక్తులు ఇంక ఎవరైనా ఉన్నారా, నగదు లావాదేవీలు ఎవరెవరి ఖాతాల్లోకి వెళ్లాయా అని ఆరా తీస్తున్నారు. ఇతర జిల్లాల్లోనూ ఇలాంటి కేసులు ఏమైనా ఉన్నాయా అనే కోణాల్లో పోలీసుల దర్యాప్తు కొనసాగుతున్నట్లు సమాచారం. ఈ కేసు నేపథ్యంలో పోలీసులు అభ్యర్థులకు ముఖ్య సూచనలు చేస్తున్నారు. పోలీస్, ఇతర ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో ఎవరు డబ్బులు అడిగినా వెంటనే అప్రమత్తంగా ఉండాలని, అధికారిక నోటిఫికేషన్లు, నియామక పక్రియల ద్వారానే ఉద్యోగాలు వస్తాయని పోలీసులు గుర్తు చేశారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు ఉద్యోగాలిప్పిస్తామని చెప్పి డబ్బులడిగితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.


# అమెరికాతో ఒప్పందం మనకే నష్టం

**మన రైతులకు తీరని అన్యాయం జరగనుంది**

**ఎక్స్ వేదికగా కాంగ్రెస్ జైరామ్ రమేశ్ విమర్శలు**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7 (నినాదం):**

భారత్ అమెరికాతో చేసుకున్న వాణిజ్య ఒప్పందంపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ కేంద్రాన్ని తీవ్రంగా విమర్శించారు. అమెరికా వ్యవసాయోత్పత్తులపై భారత్ దిగుమతి సుంకాల్ని తగ్గించడం వల్ల అమెరికా రైతులకే ప్రయోజనం చేకూరుతుందని ఆయన అన్నారు. ఈ మేరకు ఆయన శనివారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. 'ఇటీవల విడుదల చేసిన అమెరికా– భారత్ సంయుక్త ప్రకటనలో.. ఆ ఒప్పందంకి సంబంధించిన వివరాలేమీ లేవు. భారత్ ఇకపై రష్యా నుంచి చమురును దిగుమతి చేసుకోదనే విషయం మాత్రం స్పష్టంగా తెలుస్తుంది. అలాగే రష్యా నుండి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా చమురు కొనుగోలు చేస్తే 25 శాతం జరిమానాను భారత్‌పై తిరిగి విధించ్చని అమెరికా ప్రకటించింది' అని రమేష్ ఎక్స పోస్టులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోడిని ఆయన విమర్శించారు. ట్రంప్‌తో మోడీ దిగిన ఫొటోలను ప్రస్తావిస్తూ.. 'ఫొటో ఆప్స్ భారతదేశానికి పెద్దగా ప్రయోజనం చేకూర్చలేదని, దౌత్య వైఫల్యాన్ని సూచిస్తున్నాయని ఆయన అన్నారు.



భారతీయ రైతులను పణంగా పెట్టి అమెరికన్ రైతులకు సహాయం చేయడానికి భారతదేశం దిగుమతి సుంకాలను తగ్గిస్తుంది. ఈ ఒప్పందంతో అమెరికా నుండి భారత్ వార్షిక దిగుమతులు మూడురెట్లు పెరుగుతాయి. మన దీర్ఘకాల వస్తువుల వాణిజ్య మిగులు తుడిచిపెట్టుకుపోతుంది. భారత్ నుంచి అమెరికాకు ఐటి, ఇతర సేవల ఎగుమతులపై తీవ్ర అనిశ్చితి కొనసాగుతుంది. అలాగే అమెరికాకు ఎగుమతులు చేసే భారత్ వస్తువులపై గతకంటే ఎక్కువ సుంకాలు విధిస్తారు. దీన్నిబట్టి చూస్తే.. ట్రంప్‌ను చేసుకున్న కౌగిలింతలు, దిగిన ఫొటోలు పెద్దగా ఫలించలేదు. నమస్తే ట్రంప్.. హౌడీ మోడీపై స్కోర్ చేసింది. స్నేహితుడు ఇకపై స్నేహితుడు కాదు అని జైరాం రమేశ్ అన్నారు.

# ఉపాధి హామీ పథకం పరిరక్షణ యాత్ర

**పథకాన్ని నీరుగారుస్తున్న కేంద్ర బిజెపి...**

**ఎపి కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల**

**తిరుపతి, ఫిబ్రవరి 7 (నినాదం):**

మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పరిరక్షణ యాత్రలో భాగంగా తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండలం కోటపోలూరు పంచాయతీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి రచ్చబండ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పేద బడుగు బలహీన వర్గాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుని వచ్చిన మహాత్మా గాంధీ జాతి ఉపాధి హామీ పథకం చట్టాన్ని బిజెపి ప్రభుత్వం నీరుగారుస్తుందని,పేదల కడుపు కొట్టేందుకే పథకం పేరు మార్చి 125 రోజులు పెంచుతున్నట్లు బూటకపు మాటలు చెబుతున్నారని తెలిపారు. 8 గంటల ఉన్న పనిని 12 గంటలు చేశారని, పూర్తిగా కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం,కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు ఇస్తామని చెప్పడం పేద ప్రజలకు ద్రోహం చేసినట్లు కాదా అని మండిపడ్డారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో రాజశేఖర్ రెడ్డి తీసుకొచ్చిన అనేక సంక్షేమ పథకాలు భారతదేశంలోని అన్ని రాష్ట్రాలు ఆచరణలో పెట్టాయని తెలిపారు.గ్రామాలలో గుడులు, బడులు లేకపోయినా బెల్ట్ షాపులు మాత్రం అధికంగా ఉన్నాయని,రాష్ట్రంలో రహదారులు అధ్వానంగా తయారయ్యాయని,రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ అనారోగ్యంతో ఉందని తెలిపారు.మళ్లీ మన అందరి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అటు దేశం అభివద్ధి పథంలో దూసుకుపోతుందని వైయస్ షర్మిల తెలియజేశారు.పై కార్యక్రమంలో తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలగురువం బాబు,కాంగ్రెస్ పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జ్ మావుడూరు వెంకటాచలపతి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, నియోజకవర్గ ఇన్చార్జిలు, మండల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



# ముంబై మేయర్ పదవి బిజెపికే

**బిజెపి మేయర్ అభ్యర్థిగా రితూ తావ్డే**

**డిప్యూటి మేయర్‌గా శివసేన కార్పొరేటర్ సంజరు శంకర్ ఘాడి**

**నామినేషన్లు దాఖలు..11న ఎన్నిక**

**ముంబై, ఫిబ్రవరి 7 (నినాదం):**

ముంబయి మేయర్ పదవిని బిజెపి దక్కించుకోవడం ఖాయమైంది. ఈ క్రమంలో అధికార మహాయుతి కూటమి అభ్యర్థిని ఖరారు చేసింది. భాజపా కార్పొరేటర్ రితూ తావ్డే ఈ బరిలోకి దిగనున్నట్లు ఆ పార్టీ నేత అమిత్ సతమ్ ప్రకటించారు. పార్టీ అగ్ర నాయకత్వంతో సంప్రదింపులు జరిపిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. స్థానికంగా భాజపా సీనియర్ నేత అయిన రితూ మూడుసార్లు కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ విద్యా కమిటీ అధ్యక్షురాలిగా పనిచేసిన అనుభవం కూడా ఆమెకు ఉంది. ఇక, డిప్యూటీ మేయర్ పదవికి కూటమి అభ్యర్థిగా శివసేన కార్పొరేటర్ సంజరు శంకర్ ఘాడిని ఎంపిక చేసినట్లు సతమ్ వెల్లడించారు. రితూ, సంజరులు శనివారం నామినేషన్లు దాఖలు చేశారు. ఫిబ్రవరి 11న మధ్యాహ్నం ఈ మేయర్ ఎన్నిక జరగనుంది. కాగా.. బృహన్ ముంబయి కార్పొరేషన్ బీఎంసీలో 227 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో అధికార మహాయుతి కూటమి ఘన విజయం సాధించింది. 118 చోట్ల (భాజపా 89, శివసేన 29) గెలుపును కైవసం చేసుకుంది. ఇక, శివసేన (యూబీటీ) 65, దాని మిత్రపక్షాలైన మహారాష్ట్ర నవనిర్మాణ సేన 6, నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (శరద్‌పవార్) 1, కాంగ్రెస్ 24, ఏఐఎంఐఎం 8, ఎన్సీపీ (అజిత్ పవార్) 3, సమాజ్ వాద్ పార్టీ 2 స్థానాలను దక్కించుకున్నాయి. అయితే బిజెపి పైచేయి సాధించడంతో ఇప్పుడు మేయర్ కోసం పట్టుపట్టింది.



## విద్యార్థుల్లో దేశభక్తి పట్ల అవగాహన సదస్సు




**కరీంనగర్, ఫిబ్రవరి 7(నినాదం) :** విద్యార్థుల్లో దేశభక్తి పట్ల అవగాహన పెంపొందించడం, అలాగే వివిధ దేశాల గురించి తెలుసుకోవడం ఎంతో అవసరమని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక వావిలాలపల్లి లోని అల్ఫోర్స్ ప్రైమరీ పాఠశాల క్యాంపస్‌లో స్ఫూర్తిదాయకంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి మాట్లాడారు. విద్యార్థులకు దేశం పట్ల విస్తృత అవగాహన కల్పించడం ద్వారా వారి జ్ఞానం మరింత పెరుగుతుందని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి పాఠశాల పాఠ్య ప్రణాళికలో భాగంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తు న్నా టమని చెప్పారు. విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న విషయాలను మరింత సృజనాత్మకంగా రూపొందించి అమలుపరచాలని సూచించారు. ప్రతి విద్యార్థి నేర్చుకున్న అంశాలను ఎప్పటికప్పుడు విశ్లేషించి వాటిపై పట్టు సాధించాలని అన్నారు. సామాజిక అవగాహన కలిగి ఉండడం ద్వారా ఎన్నో అవకాశాలు లభించడమే కాకుండా, వివిధ పోటీ పరీక్షల్లో కూడా ఘన విజయం సాధించవచ్చని తెలిపారు. అలాగే దేశ స్వాతంత్ర్యాన్ని అందించిన నాయకుల చరిత్రను తెలుసుకోవడం ద్వారా స్ఫూర్తిని పొందడమే కాకుండా, లక్ష్య సాధనకు మరింత ప్రేరణ కలుగుతుందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి కనీస బాధ్యతగా వివిధ నాయకుల గురించి అవగాహన పెంపొందించు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, తల్లిదండ్రులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## అలుపెరుగని.. ప్రజా సేవకుడు

**ఆపన్న హస్తం అందించే నిరుపేదల సారథి**
**ఆదరించి ఆశీర్వదిస్తే.. సేవకుడిగా పనిచేస్తా**
**30 వ వార్డు అభ్యర్థి చందా రాజు**





**జమ్మికుంట, ఫిబ్రవరి 7 (నినాదం) :** ఎన్నో అవాంతరాలు ఎదురైనా మొక్కవోని ధైర్యంతో నిరుపేదలకు అండగా ఉండే నైజం అతని స్వంతం.. మన పర బేధం లేకుండా ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తం అందించి అండగా ఉండే కల్మషం లేని మహానీయుడు. ప్రజా సమస్యల కోసం పరితపించే కృషివల్యుడు. పేదింటి ఆత్మబంధువుగా జనం మెచ్చిన నాయకుడిగా చందా రాజు ప్రజలలో చెరగని ముద్ర వేసుకున్నాడు. 30వ వార్డు ప్రజల మద్దతు దీవెనలతో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఒడితల ప్రణవ్ బాబు సహాయ సహకారాలతో 30వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా బరిలో ఉన్నాడు చందా రాజు. ఆదరించి చేతి గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదిస్తే మీ కష్టసుఖాల్లో పాలుపంచుకొని తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ సహాయ సహకారాలతో వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని గడపగడపకు తిరుగుతూ విస్తృత ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు.

**ప్రజా బాంధవుడుగా చెరగని ముద్ర**

స్థానికంగా నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండే నాయకుడు. చిన్న వయసు నుండే రాజకీయాల్లోకి ప్రవేశించి మహానేతలతో కలిసి పనిచేసిన అనుభవంతో రాజకీయాలతో పాటు ప్రజల సమస్యలను పరిష్కరించే నాయకుడుగా చెరగని ముద్ర వేసుకున్నాడు. నమ్ముకున్న పార్టీ సిద్ధాంతాల కోసం పనిచేయడమే కాకుండా పేద ధనిక మన ఇతర పార్టీ అనే భేదం లేకుండా కష్టం వచ్చినవారికి నేనున్నా అంటూ భరోసా కల్పిస్తూ పది సంవత్సరాలుగా వార్డు ప్రజల అభ్యున్నతి కోసం పాటుపడుతున్న సేవా తత్పరుడు చెందారాజు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 30 వార్డులలో ఏ వార్డుకు వెళ్లిన చందా రాజు పేరు తెలియదు అనడంలో అతిశయోక్తి లేదు. అహంలేని నిస్వార్థ సేవకుడిగా పేరుపొందిన చందా రాజు ప్రజా బాంధవుడిగా చెరగని ముద్ర వేసుకున్నాడు.

**అభివృద్ధి చేసే సత్తా ఉన్న నాయకుడు..**

స్థానిక సమస్యల పట్ల పూర్తి అవగాహన ఉన్న నాయకుడు చందా రాజు. నమ్ముకున్న పార్టీకి నమ్మిన బంటుగా ఉంటూ మంత్రుల వద్ద, ఎమ్మెల్యేల వద్ద, నియోజకవర్గ ఇన్చార్జిల వద్ద తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకొని పార్టీ బలోపేతానికే కాకుండా తనను నమ్ముకున్న ప్రజల కోసం కూడా సహాయ సహకారాలు అందిస్తూ ముందుకు సాగుతున్నారు.

**ప్రజావార్డు కార్యాలయం ఏర్పాటు.. చందా రాజు**

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 30 వ వార్డు ప్రజలు స్థానికంగా ఉన్న తాసిల్దార్ కార్యాలయంలో కానీ మండల పరిషత్ కార్యాలయంలో కానీ మరి ఏ ఇతర పనుల కోసమైనా కానీ తాను కౌన్సిలర్ గా గెలిచిన తర్వాత 30 వ వార్డులో ఏర్పాటు చేసే వార్డు కార్యాలయంలో తమ సమస్యలను తెలియజేసినట్లయితే వాటిని సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు చేపడతారని చందా రాజు పేర్కొన్నారు. 30వ వార్డు ప్రజలు తనను ఆదరించి మరొకసారి అవకాశం కల్పించి తన నిజాయితీ నిరూపించుకునే విధంగా ఓటు వేసి గెలిపించాలని కోరారు.

## ప్రభుత్వాసుపత్రిలో డెలివరీలపై
# అవగాహన కల్పించాలి




**ప్రజారోగ్య సేవలను మరింత మెరుగుపరచాలి**
**పీ.హెచ్.సిలో ప్రసూతి సంఖ్య పెంచాలి**
**వైద్య ఆరోగ్యశాఖ సమీక్షలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

**కరీంనగర్, ఫిబ్రవరి 7(నినాదం) :** ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజా ఆరోగ్య సేవలను మరింత మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, వివిధ సామాజిక ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సమకూర్చిన అధునాతన పరికరాలను ఉపయోగిస్తూ రోగులకు మరింత విస్తృత సేవ అందించాలని అన్నారు. ఆస్పత్రుల్లో ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఉచిత మందుల వివరాల బోర్డును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గైనకాలజీ, పిల్లల వైద్యులు, మెడికల్ ఆఫీసర్లు సమన్వయంతో గర్భిణీలు, శిశువులకు సేవలు అందించాలని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. శుక్రవారం సభలకు వైద్యాధికారులు హాజరై ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీలకు లభించే ఉచిత పరీక్షలు, మందులు, చికిత్స పట్ల అవగాహన కల్పించాలని ఆదేశించారు. తద్వారా ప్రభుత్వాసుపత్రిలో డెలివరీల సంఖ్య పెంచవచ్చని సూచించారు. అతిగా బరువు తక్కువ ఉన్న చిన్నారులను గుర్తించి ఎన్.ఆర్.సికి రిఫర్ చేయాలని అన్నారు. ఇన్ఫెక్షన్ కంట్రోల్ కమిటీలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆస్పత్రులకు అత్యవసరంగా కావలసిన ఇతర పరికరాలను కొనుగోలు చేయాలని సూచించారు. ఆసుపత్రుల్లో రోగుల అటెండర్లు కూర్చునేందుకు బెంచీలు తదితర సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. వయసును బట్టి చిన్నారులకు, శిశువులకు ఇవ్వాల్సిన అన్ని రకాల టీకాలను సమయం ప్రకారం ఇవ్వాలని ఆదేశించారు. టీకాల సమయం విషయంలో తల్లిదండ్రులను అప్రమత్తం తెలిపారు. ఇమ్యునైజేషన్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టీబీ పరీక్షల సంఖ్య పెంచి జబ్బు ఉన్న వారిని గుర్తించాలని, మందులు అందజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ప్రోగ్రాం అధికారి సనా, జి.జి.హెచ్ ఆర్.ఎం.ఓ నవీన ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.

## ప్రచారంలో దూకుడు పెంచిన బచ్చు శివకుమార్

**30 వ వార్డులో విస్తృత ప్రచారం నిర్వహించిన బిజెపి అభ్యర్థి**



**జమ్మికుంట, ఫిబ్రవరి 7 (నినాదం):** జమ్మికుంట మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలంటే మున్సిపల్ పై బిజెపి జెండా ఎగరాలని 30 వార్డు బిజెపి అభ్యర్థి బచ్చు శివకుమార్ అన్నారు. శనివారం వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించిన శివకుమార్ మాట్లాడుతూ, దేశంలో రాష్ట్రంలో గతంలో జరిగిన ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలిచారని జమ్మికుంట మున్సిపాలిటీలో బిజెపి అభ్యర్థులను గెలిపిస్తే కేంద్రం నిధులతో అభివృద్ధి చేయడం సాధ్యమని ఆయన అన్నారు. 30 వ వార్డులో బిజెపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను వార్డు ప్రజలు ఒక అవకాశం ఇచ్చి గెలిపిస్తే కాలనీలోని సమస్యలు పూర్తిగా తీరుస్తానని ముఖ్యంగా ఖాసిం గల్లి తో పాటు వివిధ గల్లీలలో ఉన్న సమస్యలను పరిష్కారం చేస్తూ కాలనీని అందంగా తీర్చిదిద్దుతానని ఆయన హామీ ఇచ్చారు. శనివారం నిర్వహించిన ప్రచారంలో ప్రజల నుండి విశేష స్పందన రావడం సంతోషంగా ఉందని అవకాశం ఇచ్చి ఆశీర్వదించి గెలిపించాలని ఆయన కోరారు.

## వీణవంక సమ్మక్క సారలమ్మ హుండీ ఆదాయం7 లక్షల 65,470



**జమ్మికుంట, ఫిబ్రవరి 7 (నినాదం) :** మినీ మేడారంగా ప్రసిద్ధి చెందిన వీణవంక సమ్మక్క సారలమ్మ హుండీ లెక్కింపు శనివారం అధికారుల సమక్షంలో జరిగింది. వీణవంక సమ్మక్క సారలమ్మ హుండి ఆదాయం సుమారు 7. 65.470 రూపాయలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా వీణవంక పోలీస్ ఎస్సై ఆవుల తిరుపతి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు. శాంతియుత వాతావరణంలో, సంపూర్ణ పారదర్శకతతో లెక్కింపు కొనసాగుతోంది. సమ్మక్క-సరళమ్మలపై భక్తుల నమ్మకానికి నిదర్శనంగా భారీ మొత్తంలో కానుకలు హుండీలో చేరడం విశేషంగా మారింది. రోజురోజుకూ భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో వీణవంక మినీ మేడారం గా మాత్రమే కాకుండా, భక్తి ఉద్యమానికి కేంద్ర బిందువుగా మారుతోందని స్థానికులు అంటున్నారు. ఈ కార్యక్రమంలో ఏవో రాజయ్య తో పాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బస్సు ప్రమాద బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే నవీన్ యాదవ్



**జమ్మికుంట, ఫిబ్రవరి 7 (నినాదం) :** జమ్మికుంట పట్టణంలో శుక్రవారం రోజున హుజురాబాద్-జమ్మికుంట రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి పై బస్ టైర్ పేలిన ఘటనలో క్షతగాత్రులను పరామర్శించిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ కుమార్ యాదవ్ ,హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్. ఈ సందర్భంగా వారు ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దొంత రమేష్ సుగుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## 24 వార్డు.. ప్రచారంలో దూసుకుపోతున్న సిలువేరు స్వాతి రమేష్

**కారు గుర్తుకు ఓటు వేయాలని ఇంటింటా ప్రచారం**
**ఎమ్మెల్యే సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి**





**జమ్మికుంట, ఫిబ్రవరి 7 (నినాదం) :** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 24వ వార్డు లో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి సిలివేరు స్వాతి రమేష్ గడప గడప కు తిరుగుతూ తమ ప్రచారాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత పది సంవత్సరాలుగా 24 వ వార్డు అభివృద్ధికి నోచుకోలేదని వార్డు అభివృద్ధి చెందాలంటే టిఆర్ఎస్ పార్టీ బలపరిచిన మమ్మల్ని భారీ మెజార్టీతో గెలిపించాలని వారు వార్డు ప్రజలను కోరినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారంలో గత పాలకుల నిర్లక్ష్యం ఉందని ఒక అవకాశం ఇచ్చి ఆశీర్వదిస్తే ఎమ్మెల్యే సహకారంతో వార్డుకు భారీగా నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానని స్వాతి రమేష్ తెలిపారు. కాలనీలో ఎక్కడికి వెళ్లినా ప్రజలు ఆదరించి ఆశీర్వదిస్తున్నారని వారి ఆశీర్వాదంతో తప్పకుండా గెలుస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. తమకు సహకరిస్తున్న వార్డు అధ్యక్షులు పరిమళ మాణిక్యం తో పాటు టిఆర్ఎస్ నాయకులు ఎలగందుల సమ్మయ్య వరగంటి సదానందం బూరుగుపల్లి కిరణ్ క్యాతం రవీందర్ జిల్లెల్ల ప్రసాద్ నరేష్ లతోపాటు వార్డు ప్రజలకు వారు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 11న జరిగే ఎన్నికల్లో మీ అమూల్యమైన ఓటు కారు గుర్తుపై వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని వారు ప్రజలను కోరారు.

## గంగుల రాష్ట్ర నిధులతో కేబుల్ బ్రిడ్జ్ నిర్మాణం చేస్తే ఇప్పుడు దాని పరిస్థితి చూడాలన్నారు

**బీజేపి నాయకులు మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు**



**కరీంనగర్, ఫిబ్రవరి 7(నినాదం) :** నగర అభివృద్ధి లో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పాత్ర లేదని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ వాఖ్యలు చేయడం హాస్యాస్పదం అని బీజేపి నాయకులు మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు. నగరంలోని హోటల్ త్రిదా లో శనివారం రోజున ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సునీల్ రావు మాట్లాడుతూ, నగరం అభివృద్ధి లో బీఆర్ఎస్ పాత్ర ఉందని ప్రజలను మభ్యపెట్టే వాఖ్యలు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చేయడం చాలా దుర్మార్గం అన్నారు. 2017 లో కరీంనగర్ నగరపాలక సంస్థ కు స్మార్ట్ సిటీ హోదా వస్తే,2020 వరకు ఎలాంటి అభివృద్ధి పనులు జరగకపోవడానికి కారణాలు ఏమిటో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. నగరపాలక సంస్థ అభివృద్ధి లో బండి సంజయ్ కుమార్ తన బాధ్యతను సమర్థవంతంగా నెరవేర్చిన ప్రజల నాయకుడని, కొనియాడారు. మున్సిపల్ కార్పొరేషన్ లో కార్పొరేటర్ గా పని చేసి కరీంనగర్ నియోజకవర్గ పార్లమెంట్ అభ్యర్థిగా.., ప్రస్తుతం కేంద్ర మంత్రి గా నగర ప్రజలకు విశేష సేవలు అందించిన గొప్ప నాయకులు బండి సంజయ్ అని అన్నారు. గత ఐదు సంవత్సరాల కాలంలో నగరంలో జరిగిన అభివృద్ధి ప్రజలకు కళ్ల ముందు కనబడుతుందన్నారు. 2017 లో కేంద్ర ప్రభుత్వం కరీంనగర్ ను స్మార్ట్ సిటీగా ప్రకటిస్తే,2020 జనవరిలో మేము మేయర్ గా ప్రమాణ స్వీకారం చేసే వరకు కేవలం 19 లక్షల రూపాయల అభివృద్ధి పనులు మాత్రమే జరిగాయన్నారు. కరీంనగర్ ఎంపిగా బండి సంజయ్ కుమార్ గెలిచిన తర్వాతే మొదటి సారిగా కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీ కార్పొరేషన్ కు 196 కోట్లు విడుదల చేయడం జరిగిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీ ఇచ్చినప్పటికీ రెండున్నర సంవత్సరాలు కరీంనగర్ కు నష్టం చేసింది ఎమ్మెల్యే గా ఉన్న గంగుల కమలాకర్ కాదా. అని ప్రశ్నించారు. బండి సంజయ్ కుమార్ కేంద్ర ప్రభుత్వం నుండి 196 కోట్లు విడుదల చేసినా. సంవత్సరం పాటు ఆ నిధులను కార్పొరేషన్ కు విడుదల చేయకుండ జాప్యం చేసింది మీ రాష్ట్ర ప్రభుత్వం కాదా? అని ప్రశ్నించారు. 2020 కి ముందు కరీంనగర్ నగరం ఎలా ఉండేది తర్వాత ఎలా మారిందనేది జరిగిన అభివృద్ధే సజీవ సాక్ష్యం అన్నారు. కేంద్ర ప్రభుత్వం 429 కోట్లు కరీంనగర్ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ కు ఇస్తే, రాష్ట్ర ప్రభుత్వ వాటా విడుదల చేయకుండ జాప్యం చేసిందని మండి పడ్డారు. బండి సంజయ్ కుమార్ చొరవతో వచ్చిన స్మార్ట్ సిటీ నిధుల నుండి నగర వ్యాప్తంగా అభివృద్ధి పనులు చేపట్టి వరంగల్ కంటే ముందు పనులు పూర్తి చేశామని తెలిపారు. వరంగల్ కార్పొరేషన్ 500 కోట్ల నిధులు వినియోగించుకోలేని స్థితిలో ఉంటే కరీంనగర్ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ 856 కోట్లు వినియోగించుకొని నగరాన్ని సుంధరంగా మార్చామన్నారు. డంపింగ్ యార్డు గుట్టలను తరలించాలని ఉన్నతాధికారి నిధులు కేటాయి టెండర్ పిలుస్తే దాన్ని అడ్డుకున్నది ఎవరని ప్రశ్నించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కోసం 50 కోట్లు కేటాయిస్తే అనాడు రాష్ట్ర ప్రభుత్వం డంపు యార్డు కొసం స్థలం కేటాయించకుంటే ఆ నిధులు ఎక్కడ వాడాలని... ప్రశ్నించారు. స్థలాలు కేటాయించకుండ అడ్డుకున్నది ఎవరనేది ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో చీటి రామారావు, బండారి వేణు, తాటి ప్రభావతి, కన్నం శ్రీనివాస్, రమేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## అనుమానంతో... భార్యను నరికి చంపిన భర్త

**అనాథలైన పిల్లలు .. అదుపులోకి తీసుకున్న పోలీసులు**



**జగిత్యాల ప్రతినిధి ఫిబ్రవరి 7 (నినాదం) :** బాధ్యత మరిచి తాగుడు బానిసైన ఓ భర్త కట్టుకున్న భార్యను కడతేర్చిన ఘటన జగిత్యాల జిల్లాలో కలకలం రేపింది. గ్రామస్తులు పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన అదరవేని మల్లయ్య( 49) మల్లయ్యకు జగిత్యాల మండలం ఉప్పరపేట గ్రామానికి చెందిన ఆధరవేని సత్యవ్వ (44) గత 15 సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నారు. ఈ దంపతులు మల్లయ్య స్వగ్రామంలోని సొంత ఇంట్లో కాపురం ఉంటున్నారు. వీరికి కొడుకు కూతురు ఉన్నారు. మల్లయ్య బాధ్యతలు మరిచి తాగుడుకు బానిస అయ్యాడని సత్యవ్వ దూరం పెట్టింది. పిల్లలను చూసుకొని ఇవ్వకుండా ఇంట్లోకి రానివ్వకుండా మల్లయ్యని ఒంటరి చేయడంతో అనేకసార్లు భార్యాభర్తల పంచాయతీలు గ్రామ పెద్దలు నిర్వహించారు. అయినా ఇద్దరిలోనూ మార్పు రాకపోవడంతో మల్లయ్య రోడ్డున పడ్డాడు. మల్లయ్య కు సంబంధించిన నాలుగు ఎకరాల పొలం వ్యవసాయం చేయించుకుంటూ పిల్లల్ని పోషిస్తూ కాలం వెళ్ళదీస్తున్న సత్తవ్వ పై శనివారం అర్ధరాత్రి గొడ్డలితో దాడి చేసి హత్య చేయడంతో గ్రామం ఒక్కసారి ఉలిక్కిపడింది. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని అదుపులోకి తీసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

## కళాశాల విద్యార్థిని అదృశ్యం



**జవహర్ నగర్ ఫిబ్రవరి 7 (నినాదం):** కళాశాల విద్యార్థిని అదృశ్యమైంది. ఈ సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. జవహర్ నగర్ ప్రాంతంలోని గిరి ప్రసాద్ నగర్ కాలనీలోపొనగంటి స్వరూప, కుమార్తె సోనీ, కుటుంబసభ్యులతో కలిసి నివసిస్తున్నారు. సోని(20) ఈ నెల 7న ఇంటినుంచి బయటకు వెళ్ళి ఇంత వరకు తిరిగిరాలేదు. సోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. దీంతో ఆమెఆచూకి కోసం చుట్టుప్రక్కల, బంధువుల వద్ద వెతికిన సమాచారం లభించలేదు. ఈ మేరకు కుటుంబసభ్యులుజవహర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## డంపింగ్ యార్డ్ పొగతో కాలనీ ఉక్కిరిబిక్కిరి

**బయో మైనింగ్ యంత్రం ఉపయోగించాలి**
**డంపింగ్ యార్డ్ సందర్శించిన జీవన్ రెడ్డి**





**జగిత్యాల ప్రతినిధి ఫిబ్రవరి 7 నినాదం :** నూకపల్లి అర్బన్ హౌసింగ్ పక్కనే ఉన్న డంపింగ్ యార్డ్ కు మున్సిపల్ సిబ్బంది నిప్పుపెట్టారు. పొగతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారనే సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి జీవన్ రెడ్డి శనివారం కాలనీ సందర్శించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ ఇళ్ల మధ్య నుండి చెత్త వాహనాలు వెళ్తుండడంతో చెత్త పడుతోందని అవేదన వ్యక్తం చేశారు. చెత్త గుట్ట దగ్గర పోయకుండా దగ్గరగా ఎందుకు పోస్తున్నారని మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. పొగతో శ్వాస కోస వ్యాధులు వస్తున్నాయి.. పిల్లలు నిద్ర పోవడం లేదని కలెక్టర్ తో మాట్లాడారు నాక్ విద్యార్థులు అస్వస్థతకు గురి అవుతున్నారని అన్నారు ఇళ్ల లో ఉన్న వారికి పొగతో ఊపిరి అడుతలేదు..రోగాలు వస్తున్నాయన్నారు ఇల్లు ఇచ్చినా.. చెత్త డంపింగ్ యార్డ్ నుండి వచ్చే పొగ, దుర్వాసనతో ఇళ్ల లో ఉండలేక పోతున్నా నీ కాలనీవాసులు బాధలు చెబుతున్నారు మున్సిపల్ అధికారులు తమ శ్మశాన వాటిక ఉపయోగించుకోకుండా చేస్తున్నారు అని వాపోయారు. చెత్త కుప్పల కు మున్సిపల్ సిబ్బంది నిప్పు పెడుతూ,ఎవరో అగ్గిపెడుతున్నారని చెబుతున్నారని జీవన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. పొగ, దుర్వాసనతో ఇళ్ల లో ఉండలేకపోతున్నాం అని గోడు వెళ్లబోసుకున్నారు. ఇళ్లలో ఉండకుండా ఇక్కడి నుండి వెళ్ళిపోయేలా ఇళ్ల దగ్గర చెత్త డంపింగ్ చేస్తున్నారు..నాలుగు ఎకరాల్లో శ్మశాన వాటిక ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. మాజీ మంత్రి వర్యులు జీవన్ రెడ్డి మున్సిపల్, రెవెన్యూ అధికారులతో ఫోన్ లో మాట్లాడారు. వేలాది టన్నుల చెత్త కుప్పలు పోగుబడుతున్నదన్నారు. చెత్త ఇళ్ల దగ్గర ఎందుకు పోస్తున్నారు. చెత్త గుట్ట దగ్గర పోసి రీసైక్లింగ్ చేయాలన్నారు ఒక ప్రణాళిక ప్రకారం చెత్త డంపింగ్ చేయకుండా ఎక్కపడితే అక్కడ ఎందుకు డంపింగ్ చేస్తున్నారన్నారు చెత్తను గుట్ట దగ్గర పోయకుండా.. ఇళ్ల దగ్గర ఎందుకు డంపింగ్ చేస్తున్నారన్నారు

**రెవెన్యూ భూములు చదును చేసి, డంపింగ్ చేయాలి..**

బయో మైనింగ్ మిషన్ కోసం జెనరల్ ఫండ్ ను ఉపయోగించుకోవాలి..అని సూచించారు. అధికారుల బాధ్యతారాహిత్యం తో చెత్త కు నిప్పంటుకొని ఇళ్ల లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు ఇళ్లకు దగ్గరగా చెత్త డంపింగ్ చేయడం ఏమిటి..అని నిలదీశారు. వాల్ట చట్టం కింద ఒక చెట్టు తీయాలన్న అనుమతి తీసుకోవాలన్నారు గుట్ట అమ్మిందెవరు..పట్టాలు ఉంటే గుట్ట తవ్వుతారా అని నిలదీశారు నర్సింగ్ పూర్ గుట్టలు మొత్తం తవ్వుతున్నా..ఏం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**గుట్టలకు పట్టాలు ఇచ్చింది ఎవరు..**

నర్సింగ్పూర్ గుట్ట తవ్వుతున్నారు...పట్టా భూమి అయినప్పటికీ వాల్ట చట్టం ప్రకారం అనుమతి తీసుకోకుండా ఎలా తవ్వుతారు. గుట్ట పట్టా ఎలా అయింది.. పట్టా భూమి అయినా గుట్టను ఎలా తవ్వుతారని అధికారులను ప్రశ్నించారు ప్రభుత్వాలు మారినా.. ఇంకా దోపిడి కొనసాగడం ఏమిటి.. తక్షణమే మట్టి తవ్వుతున్న వాహనాలను సీజ్ చేయించి, సర్వే చేయించాలన్నారు వాల్ట చట్టం ప్రకారం అనుమతులు ఉన్నాయా లేదా అని పరిశీలించాలి అని సూచించారు. ఇళ్ల పక్కన చెత్త డంపింగ్ చేయడంతో ప్రజలు ఇళ్ల లో ఉండలేకపోతున్నారు..

**అధికారుల బాధ్యత రాహిత్యంతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుంది..**

అక్రమ మట్టి తవ్వకాల పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. డంపింగ్ యార్డు లో మంటలు ఆర్పండి.. అడ్వాన్స్ టెక్నికల్ సెంటర్ నుండి నేరుగా గుట్ట వరకు రోడ్డు వేయడంతో దూరం తగ్గడంతో పాటు, ఇంధన ఖర్చు తగ్గుతుంది. చెత్త వాహనాలు డబుల్ బెడ్రూం ఇళ్ల నుండి వెళ్లకుండా పరిశీలించి, చర్యలు తీసుకోవాలి.

**రెవెన్యూ అధికారులతో సమన్వయంతో సర్వే చేయించాలి..**

బయో మైనింగ్ మిషన్ ఏర్పాటు చేయాలి..ఇళ్ల వద్ద చెత్త డంపింగ్ చేయకుండా బాధ్యత తీసుకుంటా...అవసరమైతే మరింత భూమిని చెత్త డంపింగ్ కు సేకరించాలి..జగిత్యాల నుండి నెలకు 100 టన్నుల చెత్త వస్తోందన్నారుబయో మైనింగ్ మిషన్ ఉపయోగించి చెత్త సమస్య పరిష్కరించాలన్నారుచెత్త వాహనాలు డబుల్ బెడ్రూం ఇళ్ల మధ్య నుండి రాకుండా అవసరం అయితే మీకు అండగా నేను రోడ్డు పై కూర్చుంటా..అని కాలనివాసులకు భరోసా ఇచ్చారు. చెత్త ను గుట్ట దగ్గర మాత్రమే డంపింగ్ చేయాలన్నారుబయో మైనింగ్ మిషన్ ఏర్పాటు చేసేలా కృషి చేస్తా..అన్నారు

**రెండేళ్ల క్రితం జరిగిన దోపిడి ఇంకా కొనసాగుతుంది..**

నూకపల్లి డబుల్ బెడ్రూం లో నూతనంగా రెండు వార్డు ఏర్పాటు చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తే. జగిత్యాల లో ఏర్పాటు చేశారు..నాకు ఏ పదవి లేకున్నా..రాజ్యాంగం ఇచ్చిన పౌర హక్కుల కోసం కోట్లాడుతా. అన్నారు.

# ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ దుకాణాలపై నిఘా కరువు

**ఫిర్యాదు చేస్తే తప్పా పట్టించుకోరా..**

**వ్యవసాయ శాఖ తీరుపై రైతుల మండిపాటు**

**పేరుకే సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయం**





**మహాదేవపూర్ ఫిబ్రవరి 7 (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుల కార్యాలయం పేరుకే ఉందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫిర్యాదు చేసిన పది రోజులకు రైతు తన బాధను విలేకరుల ముందు వెళ్ళగక్కుకునే వరకు ఆ శాఖ అధికారులు మాత్రం డూప్లికేట్ క్రిమిసంహారకమందులు విక్రయిస్తున్న దుకాణాలపై దాడులు నిర్వహించకపోవడం పట్ల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు సైతం వ్యవసాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఏవో ,ఏఈఓ లకు తాము తీసుకున్న నకిలీ మందులను గూర్చి వివరించి తమ బాధను వివరించారు. మండలంలో 33 ఫర్టిలైజర్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణాలు ఉండగా ఏ రోజు కూడా వ్యవసాయ శాఖ అధికారులు స్వతహాగా తనిఖీలు నిర్వహించి ఏ దుకాణం పైన కేసులు నమోదు చేసిన దాఖలాలు లేకపోవడం గమనార్హం. పోలీసులు కానీ, రైతులు కానీ జరుగుతున్న పరిణామాలను తెరపైకి తెస్తే తప్ప ఆ శాఖ అధికారులు నామాత్రపు తనిఖీలు నిర్వహించి మామూళ్ల మత్తులో తూగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఓవైపు రైతాంగం తీవ్ర నష్టాల బాటలో ఉండగా నకిలీ విత్తనాలు, నకిలీ క్రిమిసంహారక మందులు విక్రయిస్తున్న వారిపై ఆ శాఖ అధికారులు నిఘా పెట్టకపోవడం గమనార్హం. ఓవైపు ప్రభుత్వం నకిలీ విత్తనాలు పెస్టిసైడ్స్ పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తున్న అవి మహాదేవపూర్ మండలంలో మాత్రం వ్యవసాయ శాఖ అధికారుల తీరుపట్ల నీరు గారి పోవటం విశేషం.

**మండల కేంద్రంలోనే ఈ దుస్థితి ఉంటే....!**

వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుల కార్యాలయం ఉన్న మండల కేంద్రంలోని ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటుంటే మండలంలోని ఆయా గ్రామాలలో ఉన్న ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణాలలో విక్రయిస్తున్న క్రిమిసంహారక మందుల విక్రయాలపై నిఘా ఎక్కడుంటుందని రైతులు ఎద్దేవా చేస్తున్నారు.

**సోమవారం పూర్తిస్థాయి విచారణ చేస్తాం : ఏడిఏ**

డూప్లికేట్ క్రిమిసంహారకమందు విక్రయించిన దుకాణంలో ఏ వివరాలు సేకరించారని వ్యవసాయ శాఖ ఏడిఏ శ్రీపాల్ ను నినాదం వివరణ కోరగా ప్రస్తుతానికి స్టాప్ సేల్ చేశామని, శాఖ అధికారుల మంతా మీటింగ్ లో ఉన్నామని సోమవారం రోజున పూర్తిస్థాయి విచారణ జరుపుతామని తెలిపారు. డిస్ట్రిబ్యూటర్ వివరాలు సేకరించారా? అని అడగగా ప్రస్తుతం అతను ఎక్కడ తెచ్చాడో తెలియదని సోమవారం రోజు పూర్తిస్థాయి విచారణ జరిపి వివరాలు సేకరిస్తామని తెలపటం ఆ శాఖ పనితీరుకు నిదర్శనం.

## ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు ముందస్తు ప్రణాళికలు



**మహాదేవపూర్ ఫిబ్రవరి 7, (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం లో మే మొదటి వారం వరకు జరిగే సరస్వతి అంత్య పుష్కరాలకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా కాటారం డిఎస్పి సూర్యనారాయణ ఆధ్వర్యంలో మహాదేవపూర్ సిఐ వెంకటేశ్వర్లు రెవెన్యూ డిప్యూటీ తహసీల్దార్ యూసుఫ్ తో కలిసి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. గత ఆది పుష్కరాల లో జరిగిన ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా వారు కాళేశ్వర క్షేత్రంలో పార్కింగ్ స్థలాలు, మహారాష్ట్ర ,చత్తీస్గడ్, మంచిర్యాల, కొమురం భీం, ఆదిలాబాద్ జిల్లాల నుండి మహారాష్ట్ర తెలంగాణ అంతర్రాష్ట్ర వంతెన వద్ద నుండి వచ్చే భక్తుల వాహనాలను నిలిపేందుకు పార్కింగ్ స్థలాలతోపాటు భక్తులకు ఘాట్ ల వద్దకు వెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు చోటు చేసుకోకుండా ముందస్తుగా సర్వే నిర్వహిస్తున్నారు. గత పుష్కరాలలో జరిగిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పోలీసులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టుతుండటం విశేషం. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మోహన్ రెడ్డి, ఎస్సై తమాషా రెడ్డి, రెవిన్యూ సర్వేయర్, తో పాటు పలువురు పాల్గొన్నారు.

## గోపాలపూర్‌లో పశు వైద్య శిబిరం



**కమలాపూర్, ఫిబ్రవరి 7 (నినాదం):** మండలంలోని గోపాలపూర్ గ్రామంలో పశు సంవర్ధక శాఖ,శనిగరం పశువైద్యశాల ఆధ్వర్యంలో శనివారం గోపాలమిత్ర ఫెర్టిలిటీ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 106 పాడి పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స, చూడి పరీక్షలు,ఎదకు రాని పశువులకు చికిత్సలు చేశారు.దూడలకు నట్టల నివారణ, బాహ్య పరన్నజీవుల నివారణకు పిచికారీ మందులు, కోళ్ల మందులు ఇతర సాధారణ వ్యాధులకు ఉచితంగా మందుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మామిడాల కల్యాణి, మాజి సర్పంచ్ గడల కొమురయ్య,మామిడాల అశోక్, గడల తిరుపతి,శనిగరం పశువైద్యాధికారి డా ప్లవన్ మజందర్, డా విక్రమ్, మండల పశు వైద్యాధికారి డా ఎ బాలకృష్ణ ,గోపాలమిత్ర సూపర్ వైజర్ రాజేశ్వర్ రావు, గోపాలమిత్రలు కుమార్, చక్రపాణి,ఎం డి సాధిక్,పార్మ సంస్థలు ఇంటాస్, అలెంబిక్, టూనేట, బిలాస్ కంపెనీల ప్రతినిధులు, పలువురు రైతులు,తదితరులు పాల్గొన్నారు.

## వృత్తి నైపుణ్యంతో మెరుగైన అవకాశాలు



**సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 7 (నినాదం):** వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకుంటే మెరుగైన అవకాశాలు లభిస్తాయని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ డాక్టర్ వి. వెంకటేశులు అన్నారు. శనివారం కళాశాల లో డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ, సిస్ టెక్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాను కంపెనీ హెచ్ఆర్ హరి సాయితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తమ కళాశాలలో జాబ్ మేళాను నిర్వహించి విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని అన్నారు. ప్రస్తుతం యువత ముందు ఎన్నో కోర్సులు అందుబాటులో ఉన్నాయని వారి లక్ష్యాలు ఆశయాలు కూడా అదే స్థాయిలో ఉండాలని అన్నారు. యువత పుస్తక పరిజ్ఞానానికే పరిమితం కాకుండా క్షేత్రస్థాయి నైపుణ్యాలను సైతం నేర్చుకోవాలని సూచించారు. అనంతరం ఎంపిక కాబడిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్లేస్మెంట్ ఆఫీసర్ ఆఫీసర్ అశోక్ విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కబడ్డీ పోటీలలో ద్వితీయ స్థానం పొందిన బాలికలు



**మహాదేవపూర్ ఫిబ్రవరి 7, (నినాదం):** సీఎం కప్ నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల బాలికల జట్టు ద్వితీయ స్థానం పొందినట్లు జిల్లా పరిషత్ బాలికల పాఠశాల పిడి గురుసింగ పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. మంథని కళాశాల మైదానంలో జరిగిన ఈ పోటీలలో మహాదేవపూర్ మండల బాలికలు ఉత్తమ ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం పొందడం పట్ల ఎంపీడీవో రవీంద్రనాథ్, ఎంఈఓ పురుషోత్తం, సర్పంచ్ హసీనాబాను, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబులు క్రీడాకారులను కోచ్ ను అభినందించారు.

## మొక్కజొన్న పంట ధ్వంసం చేసిన కోతులు



**కమలాపూర్, ఫిబ్రవరి 7 (నినాదం):** మండలంలోని వంగపల్లి గ్రామంలో కోతుల బెడదతో రైతు తీవ్రంగా నష్టపోయాడు. గ్రామానికి చెందిన రైతు నకిర్త రఘుపతి పది ఎకరాలలో ఆడ మగ సీడ్ మొక్కజొన్న పంట సాగుచేసాడు.మొక్కజొన్న చేనుపై శనివారం ఉదయం దాదాపు 200 కోతులు దాడి చేశాయి. ఈ దాడిలో ఎకరం విస్తీర్ణంలో ఉన్న మొక్కజొన్న పంట కు తీవ్ర నష్టం కలిగించాయి. పంట చేతికొచ్చే సమయంలోనే పంట నష్టం జరిగిందన్నారు.కోతుల దాడి వల్ల సుమారు 50 వేల నుంచి 80 వేల రూపాయల వరకు నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.రోజురోజుకూ కోతుల బెడద ఎక్కువైందన్నారు. ప్రజా ప్రతినిధులు,ప్రభుత్వ అధికారులు ఇప్పటికైనా స్పందించి కోతులబారి నుండి పంటలను కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. అదేవిదంగా పంట నష్ట పోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## అంగన్వాడీ సెంటర్‌లో అక్షరాభ్యాసం



**మహాదేవపూర్ ఫిబ్రవరి 7 (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మద్దులపల్లి అంగన్వాడి సెంటర్ లో చిన్నారులకు అక్షరాభ్యాసం అన్న ప్రాసన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఎల్పుల సరిత ముఖ్య అతిథిగా హాజరై పిల్లలకు అక్షరాభ్యాసం అన్న ప్రాసన చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలు అంగన్వాడి కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. చిన్నారులకు అక్షరాభ్యాసం ద్వారా విద్యాపై ఆసక్తి పెరుగుతుందని, భవిష్యత్తులో మంచి ఫలితాలు సాధించేందుకు ఇది దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు సుచరిత,శ్రీ కల, హెచ్ఈవో నాగరాజు, ఏఎన్ఎం విజయ,ఆశ వర్కర్ స్వరూప, తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

## సమాజంలో మంచి పౌరులుగా గుర్తింపు పొందాలి



**మిర్యాలగూడ ఫిబ్రవరి 7 (నినాదం):** సమాజంలో మంచి పౌరులుగా గుర్తింపు తెచ్చుకోవాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జప్తి వీరప్ప గూడెం ప్రధానోపాధ్యాయులు బొలిశెట్టి బిక్షపతి అన్నారు. శనివారం పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా హెచ్ ఎం మాట్లాడుతూ విద్యార్థులు ఈరోజు ఏ బాధ్యతలు అయితే నిర్వహించారో ఆ బాధ్యతలు భవిష్యత్తులో కూడా నిర్వహించే విధంగా కృషి చేయాలని, కష్టపడినప్పుడు ఫలితం ఖచ్చితంగా వస్తుందని ఫలితాలను అనుభవించడం కోసం ప్రయత్నం చేస్తూ భవిష్యత్తులో ఉన్నత పౌరులుగా ఎదగాలని అన్నారు.స్వపరిపాలన దినోత్సవం సందర్భంగా ప్రధానోపాధ్యాయులుగా రుత్విక్, ముఖ్యమంత్రిగా సమీర్, విద్యాశాఖ మంత్రి గా జ్యోత్స్న , కలెక్టర్ గా యోగేశ్వరి, సబ్ కలెక్టర్ గా కరిష్మా డి ఈ ఓ నిఖిత, ఎంఈఓ గా గౌతమి, ఏ ఏ పి సి చైర్మన్గా లిఖిత,ఎంపీ, ఎం ఎల్ సి , ఎమ్మెల్యే అంకిత, పవన్, అరవింద్, దివ్య , హర్షిత ఉపాధ్యాయులు గా వివిధ హోదాలను నిర్వహించారు. స్వపరిపాలన దినోత్సవం సందర్భంగా వివిధ హోదాల బాధ్యులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుడిపాటి కోటయ్య, వై దామోదర్ రెడ్డి, పి జగదీశ్వర్ రెడ్డి, వి మాధవి, టి శ్రీనివాసరెడ్డి, డి జలరాం, చంద్రకళ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

## మిర్యాలగూడ మున్సిపాలిటీలో త్రిముఖ పోటీ

**మిర్యాలగూడ ఫిబ్రవరి 7 (నినాదం):** మిర్యాలగూడ మున్సిపాలిటీ ఎన్నికల్లో త్రిముఖ పోటీలో గెలుపు కోసం ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మిర్యాలగూడ మున్సిపాలిటీలో 48 వార్డులుకు గాను 47వార్డులో బీఫాంలో ఇచ్చారు. ఒక్క వార్డులో అధికార కాంగ్రెస్ పార్టీ లో రెబల్స్ అభ్యర్థులుగా నిలబడ్డారు. టిఆర్ఎస్ పార్టీ 48 వార్డుల గాను 42 వార్డులకు బిఆర్ఎస్ 6 సిపిఎం పార్టీ పోటీ చేస్తుంది. మిత్రపక్షాలకు ఎలాంటి రెబల్ అభ్యర్థులు లేకుండా ప్రచారంలో ముందుకు దూసుకుపోతున్నారు. బిజెపి 29 వార్డులలో పోటీ చేస్తుంది . ప్రత్యేకమైన వ్యూహాలతో పార్టీ చాప కింద నీరు లాగా వెళ్తుంది. ఇట్టి విషయంలో ఓటర్లు కొంచెం అయోమయంలో పడి ఏ పార్టీకి ఓటేయాలని సందిగ్ధంలో ఉన్నారు, ముఖ్యంగా అధికార పార్టీ నాయకులు ప్రతి వార్డులో రెబల్ అభ్యర్థులు ఉన్నప్పటికిని మా పార్టీ చేస్తున్నటువంటి సంక్షేమ పథకాలు వలన మేము గెలుపు ఖాయమని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. టిఆర్ఎస్ పార్టీ మాత్రం సిపిఎం పార్టీతో పొత్తు పెట్టుకుని ప్రచారం దూసుకొని పోతున్నారు. సందట్లో సడి మీ అని బిజెపి పార్టీ మాత్రం కల్పించకుండా తనదైన బానిలో హిందుత్వమే ప్రత్యేక ఏజెండాగా తనదైన వ్యూహంతో వారంలో ముందుకు దూసుకు వెళ్తుంది. మాదే గెలుపు మాదే గెలుపు అని ధీమాతో ఉన్నారు. మిర్యాలగూడ పట్టణ ప్రజలు ఎవరి వైపు మొగ్గ చూపుతారో ఫలితాల తర్వాత తెలియనంది.

## రెండేళ్లుగా నిలిచిన ట్రాక్టర్‌కు జీవం పోసిన సర్పంచ్



**నల్లబెల్లి, ఫిబ్రవరి 7 (నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం గ్రామపంచాయతీకి చెందిన ట్రాక్టర్ గత పాలకవర్గం నిర్లక్ష్యం కారణంగా రెండు సంవత్సరాలుగా చెడిపోయి ఉపయోగం లేకుండా పక్కకు నిలిపివేయబడింది. ట్రాక్టర్ పనిచేయకపోవడంతో గ్రామపంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులు, చెత్త తరలింపు, అభివృద్ధి కార్యక్రమాలు సకాలంలో జరగక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న పరిస్థితి నెలకొంది.ట్రాక్టర్ లేకపోవడంతో గ్రామంలో పారిశుధ్య సమస్యలు తలెత్తి, అభివృద్ధి పనులు మందగించాయి. పలుమార్లు ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా గత పాలకవర్గం పట్టించుకోకపోవడంతో సమస్య మరింత తీవ్రతరమైంది.ఈ పరిస్థితిని గమనించిన గ్రామ సర్పంచ్ సపావట్ కవిత దేవు నాయక్ బాధ్యతాయుతంగా స్పందించారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ట్రాక్టర్‌ను రిపేర్ చేయించేందుకు తక్షణ చర్యలు చేపట్టారు. మరమ్మతుల పనులను వేగంగా పూర్తి చేసి ట్రాక్టర్‌ను తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ట్రాక్టర్ మరమ్మతుల అనంతరం గ్రామంలో పారిశుధ్య పనులు, చెత్త నిర్వహణ, ఇతర గ్రామాభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం అవుతాయని సర్పంచ్ తెలిపారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం, ప్రజలకు మౌలిక వసతులు సకాలంలో అందించడం తమ ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు.గ్రామ ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లే దిశగా సర్పంచ్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని గ్రామస్తులు హర్షిస్తూ స్వాగతించారు.సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు పరిష్కారం చూపినందుకు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి ఇలాగే నిరంతరం కృషి చేయాలని వారు ఆకాంక్షించారు.

## గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యలపై తహసీల్దార్‌తో సర్పంచ్‌ల భేటీ



**నల్లబెల్లి, ఫిబ్రవరి 7 (నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం గ్రామాల అభివృద్ధి, ప్రజలకు సంబంధించిన మౌలిక వసతులు, రెవెన్యూ సమస్యల పరిష్కారంపై చర్చించేందుకు లెంకలపెల్లి గ్రామ సర్పంచ్ కస్తూరి విజయలక్ష్మి రవీందర్ , ఆర్వయపల్లి గ్రామ సర్పంచ్ మాలోత్ రామ్ లాల్ , ఈరోజు తహసీల్దార్ ముప్పు కృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లెంకలపెల్లి, ఆర్వయపల్లి గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలు, పట్టాదారు పాస్‌బుక్స్, ఆధార్ సీడింగ్, పెన్షన్లు, రేషన్ కార్డులు, గృహ నిర్మాణానికి సంబంధించిన అంశాలు, గ్రామాల్లో అవసరమైన రోడ్లు, డ్రైనేజీ, త్రాగునీటి సమస్యలు తదితర అంశాలను సర్పంచ్‌లు తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని, గ్రామీణ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. పేదలు, రైతులు ఎదుర్కొంటున్న రెవెన్యూ సంబంధిత ఇబ్బందులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.దీనికి స్పందించిన తహసీల్దార్ ముప్పు కృష్ణ ప్రజా సమస్యల పరిష్కారానికి అధికార యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. గ్రామ స్థాయిలో ఉన్న సమస్యలను దశలవారీగా,పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ పథకాలు సద్వినియోగం అయ్యేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు.ఈ భేటీ సౌహార్దపూర్వక వాతావరణంలో జరిగిందని, గ్రామాల అభివృద్ధికి ఇది ఎంతో దోహదపడుతుందని సర్పంచ్‌లు పేర్కొన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేందుకు తాము నిరంతరం కృషి చేస్తామని వారు తెలిపారు.

## పోలీసుల ఫ్లాగ్ మార్చ్




**సూర్యాపేట ప్రతినిధి ఫిబ్రవరి 7 (నినాదం) :** మున్సిపల్ ఎన్నికల విధులలో భాగంగా శనివారం పట్టణ పోలీసు సిబ్బంది కుడ ,కుడ రోడ్డు వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. ఎటువంటి అల్లర్లు జరగకుండా ముందస్తుగా పాత నేరస్తులను బైండోవర్ చేశామని ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ వెంకటయ్య, రూరల్ సిఐ రాజశేఖర్ ,ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బస్సులు ఆపాలని టీజీఎస్ ఆర్టీసీకి వినతి



**నల్లబెల్లి, ఫిబ్రవరి 7 (నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలో పల్లెవెలుగు బస్సులు సరైన ప్రాంతాల్లో ఆగక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమస్యపై తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) వరంగల్ రీజినల్ మేనేజర్‌కు విజ్ఞాపన పత్రం పంపించారు. స్థానిక పోస్టాఫీస్ ద్వారా రిజిస్టర్డ్ పోస్టు రూపంలో ఈ విజ్ఞాపనను పంపినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య మాట్లాడుతూ, వరంగల్ జిల్లా నర్సంపేట ఆర్టీసీ డిపో పరిధిలో నల్లబెల్లి రూట్లో నడుస్తున్న పల్లెవెలుగు సర్వీసులు బస్టాండ్ ప్రాంతంలో మాత్రమే ఆగి, మండల కేంద్రంలోని ఇతర ముఖ్య ప్రాంతాల్లో ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వివిధ గ్రామాల నుంచి నిత్యావసర పనులు, వైద్యం, విద్య, ప్రభుత్వ కార్యాలయ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చే ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. వృద్ధులు, మహిళలు, విద్యార్థులు బస్టాండ్ వరకు నడిచి వెళ్లాల్సి రావడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి నెలకొన్నదని పేర్కొన్నారు. ఈ సమస్యను వెంటనే పరిశీలించి, నర్సంపేట ఆర్టీసీ డిపో మేనేజర్‌కు ప్రసూన లక్ష్మి,స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి, బస్టాండ్ ప్రాంతంతో పాటు మండల కేంద్రంలోని ఇతర కీలక ప్రాంతాల్లో కూడా పల్లెవెలుగు బస్సులు ఆగేలా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ యాజమాన్యం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు.లేనియెడల ప్రజాసంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు, కుల సంఘాలను కలుపుకొని సమిష్టిగా పెద్ద ఎత్తున ప్రజా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ప్రజా సమస్యలపై పోరాటం తప్పదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పరికిరత్నం, నాయకులు ఇనుగాల రవి, ప్రసాద్, రవీందర్, యుగేందర్ తదితరులు పాల్గొని తమ మద్దతు తెలిపారు.

## సమస్యల వలయంలో.. పంచాయతీరాజ్ సబ్ డివిజన్ కార్యాలయం





**• అధికారులు లేక ఖాళీ కుర్చీలు దర్శనం**

**వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 7 (నినాదం):** కొత్తకోట పంచాయతీరాజ్ సబ్ డివిజన్ కార్యాలయం సమస్యల వలయంలో చిక్కుకుంది. అధికారులు లేక ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. శనివారం మధ్యాహ్నం 12 గంటలు దాటిన కార్యాలయంలో ఖాళీ కూర్చలే దర్శనమిచ్చాయి. ఇక్కడ డీఈగా పనిచేస్తున్న అధికారికి ప్రమోషన్ వచ్చిందని తెలిసింది. సీనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న అధికారి డిప్యూటేషన్ పై వనపర్తి డివిజన్ కార్యాలయంలో పనిచేస్తున్నారు. జె.టి.ఓ గా పనిచేస్తున్న అధికారి సెలవులో ఉన్నారు. ఏఈ గా పనిచేస్తున్న అధికారి మండలంలో విధులు నిర్వహిస్తారు. ఈ సబ్ డివిజన్ కార్యాలయంలో అటెండర్ తప్పా అధికారులు ఎవరూ లేకపోవడంతో వచ్చి పోయే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. ఈ కార్యాలయంలో అధికారులు ఉన్నారా లేరా అనే అయోమయం నెలకొంది. పంచాయతీరాజ్ సబ్ డివిజన్ కార్యాలయంలో అధికారులు ఎవరూ పని చేస్తున్నారు.. ఎవరు పని చేయడం లేదు అనేది ఉన్నత స్థాయి అధికారులకు తెలవడం లేదా అనే విమర్శలు వస్తున్నాయి. కిందిస్థాయి అధికారులు పనిచేస్తున్నారో లేదో చూడాల్సిన బాధ్యత జిల్లాస్థాయి అధికారులకు ఉంది. కార్యాలయంలో అధికారులు లేక ఇబ్బంది పడుతున్న ఉన్న అధికారిని డిప్యూటేషన్ పై డివిజన్ కార్యాలయానికి పంపడంతో సమస్య ఎక్కువైంది. జిల్లా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి కొత్తకోట పంచాయతీరాజ్ సబ్ డివిజన్ కార్యాలయంలో అధికారులను సక్కదిద్దాలని పలువురు కోరుతున్నారు.

# ప్రజానేత 'మొలుగు'... పనితీరులో మెరుగు

రాజకీయాల్లోనే కాకుండా ప్రజల ఆదరణ అభిమానాలు ఆ వార్డు బిడ్డగా గత పదేళ్లుగా ప్రజా సేవకే అంకితమై నిష్పక్షపాతమైన సేవలు అందిస్తూ నాయకుడంటే మొలుగు దిలీప్ అనే విధంగా తన నడవడిక తో సత్ప్రవర్తనతో అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతున్నాడు మొలుగు దిలీప్..

జమ్మికుంట, ఫిబ్రవరి 7 (నినాదం)

- సర్వమత సమ్మేళనమే ఆశయం.
- వార్డు ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందడుగు.
- అన్నా అంటే నేనున్నానంటడు.
- బాధల్లో భరోసాగానిలిచే బాంధవుడు.
- కులానికి కాదు గుణానికి ఓటెయ్యండి : దిలీప్



జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 23వ వార్డులో పార్టీలకతీతంగా స్వతంత్ర పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా గౌను గుర్తుపై పోటీ చేస్తున్న మొలుగు దిలీప్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ కుటుంబ సభ్యుల వలె తనను ఆదరించి గౌను గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. గతంలో జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 12వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా పది సంవత్సరాల కాలం పాటు వార్డు ప్రజలకు సేవలు అందించి అన్నా అంటే నేనున్నా అనే విధంగా కుటుంబంలో ఏ సమస్య వచ్చినా ముందుండి పరిష్కరించే ఆపన్న నేస్తం దిలీప్. ముస్లింల పండగ అయినా హిందువుల పండుగైన క్రిస్టియన్ల పండుగైన ఏ కులానికి ఏ మతానికి సంబంధించిన కార్యక్రమం జరిగిన ఆ మతానికి సంబంధించిన వారికి ఆర్థిక సహాయం అందజేయడంతో పాటు నూతన వస్త్రాలను అందజేసేవాడు. సామాజిక సేవలో సైతం తనదైన ముద్ర వేసుకొని మూగజీవాలను సైతం హక్కుల చేర్చుకొని ఆదరించి ప్రకృతి ప్రేమికుడుగా పేరు గడించాడు.

వార్డు ప్రజల అభ్యున్నతి కోసం రాజకీయాలకు అతీతంగా అధికారంలో ఏ పార్టీ ఉన్న ఆ నాయకుల దగ్గరకు వెళ్లి తన వార్డు అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని కోరడమే కాకుండా వచ్చిన నిధులతో వార్డును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది అన్ని రంగులను ఆ వార్డుకు అందించి ప్రజాసేవకు అంకితమయ్యాడు.

23వ వార్డులో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తూ గతంలో తాను ఉన్న వార్డులో ఏ విధంగానైతే ప్రతి ఒక్కరికి సహాయ సహకారాలు అందించి అవార్డు బిడ్డగా ఉన్నాడో అదే తరహాలో 23వ వార్డులో సైతం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలు చేయడంతో పాటు అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని దిలీప్ పేర్కొన్నారు. 23వ వార్డు నుండి గెలిచినట్లయితే మున్సిపల్ చైర్మన్ పదవి సైతం తనకే లభిస్తుందని దాని ద్వారా మరికొంత అభివృద్ధి చేసే అవకాశం తనకు వస్తుందని ప్రజలందరూ ప్రజాసేవకు అంకితమైన తనకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు.

### మచ్చలేని 10 సంవత్సరాల రాజకీయ చరిత్ర

రెండుసార్లు మున్సిపల్ కౌన్సిలర్ గా పోటీ చేస్తున్న నేను నా కుటుంబ సభ్యులు ఏనాడు కూడా ఎవరిని ఏ రకంగా కూడా ఇబ్బంది పెట్టలేదని ఎవరికి కష్టం వచ్చినా అర్ధరాత్రి అయినా సరే వెళ్లి వారికి సేవ చేశానని దిలీప్ తెలిపారు. ప్రజలు ఓటు వేసే ముందు ఒకసారి గతంలో నేను పని చేసిన వార్డులో విచారణ చేసి తనకు ఓటు వేయాలని ఆయన బహిరంగంగా సవాల్ విసిరారు. నేను ఈ వార్డుకు అతిథిగా రాలేదని ఇక్కడ పుట్టి పెరిగిన బిడ్డగా వచ్చానని ఇక్కడికి సంబంధం లేని వారు వచ్చి ఓటు వేయమంటే ప్రజలు ఎలా వేస్తారు అని ప్రశ్నించారు. 23వ వార్డు ప్రజలు నన్ను ఆశీర్వదిస్తారని వారికి తనపై పూర్తి విశ్వాసం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



### కులాన్ని కాదు గుణాన్ని చూసి ఓటు వేయ్యండి

రిజర్వేషన్ లో భాగంగా 23 వ వార్డు జనరల్ కేటగిరికి కేటాయించగా నేను అవార్డు నుండి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని దిలీప్ తెలిపారు. జనరల్ వార్డులో దళిత బిడ్డ పోటీ చేస్తే ఓట్లు వేస్తారా? అని కొంతమంది నాయకులు తనపై దుష్ప్రచారం చేస్తూ అగ్రవర్ణాల ఓటర్లను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. కులాన్ని కాకుండా గుణాన్ని చూసి ఓటు వేస్తే అభివృద్ధి ఎలా చేశానో 12 వ వార్డును చూస్తే తెలుస్తుందని దిలీప్ తెలిపారు.

### ఆపద్బాంధవులు ఆర్యవైశ్యులు

23 వ వార్డులో నివసిస్తున్న ఆర్య వైశ్యులు ఆపద్బాంధవుడు అని దిలీప్ అన్నారు. వారి మనసుకు నచ్చితే ఎవరినైనా ఆదరిస్తారని వారికి సేవ చేసే నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఈసారి వచ్చిందని దిలీప్ తెలిపారు. ఏ వ్యాపారికి కష్టం వచ్చినా నేను అండగా ఉంటానని వారు పిలిస్తే నేనే వారి ఇంటికి వెళ్తానని నేను వాళ్లను తన ఇంటికి రమ్మని ఏనాడు పిలవనని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

# అవకాశం ఇవ్వండి .. అభివృద్ధి చేస్తా

## 4వ డివిజన్ అభ్యర్థి బొజ్జ నర్సయ్య బీజేపీదే హవా



**మంచిర్యాల, ఫిబ్రవరి 7(నినాదం):** ప్రజలు పిలిస్తే పలికే సేవకుడు, ప్రజాదారణ పొందిన నాయకుడు. ప్రజల సమస్యలు నిత్యం తెలుసు కుంటూ పరిష్కారానికి కృషి చేస్తాడు. గతంలో సింగాపూర్ గ్రామ పంచాయితీలో వార్డుమెంబర్ పని చేశాడు. ప్రజల సమస్యలు తెలుసుకుంటూ పరిష్కారం చేశాడు. ఆయన బొజ్జ నర్సయ్య. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని బీజేపీ 4వ డివిజన్ కార్పొరేటర్‌గా ప్రజల ముందుకు వస్తున్నాడు. ప్రచారంలో ప్రజలు బీజేపీకి జై కొడుతున్నాడు. డివిజన్ ప్రచారంలో పాల్గొంటూ ముందుకు సాగుతున్నారు. ఇంటిం టికీ తిరుగుతూ కమలంగుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఆయనకు అడు గడుగున ప్రజలు ఘనంగా స్వాగతం పలుకుతున్నారు. అభివృద్ధి అజెండాగా ముందుకు సాగుతుం డటంతో బీజేపీలో కొత్త ఉత్సాహం నెలకొంది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సేవచేసేం దుకు అవకాశం కల్పించాలని అభివృద్ధి ఏమిటో చేసి చూపిస్తానని పేర్కొన్నారు. బీజేపీతో అందరికి సమన్యాయం జరుగుతుంద న్నారు. రానున్నరోజుల్లో బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. కేంద్రం నిధులతో రాష్ట్రంలో అనేక పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు.

### రూ. 10లక్షలతో బోర్లు వేస్తా..

-బొజ్జ నర్సయ్య 4వ డివిజన్ అభ్యర్థి

కార్పొరేషన్ ఎన్నికల్లో గెలిపిస్తే రూ.10లక్షల నిధులతో బోర్లు ఏర్పాటు చేసి నీటిసమస్య లేకుండా చర్యలు తీసుకుటానని 4వ డివిజన్ అభ్యర్థి బొజ్జ నర్సయ్య పేర్కొన్నారు. 4వ డివిజన్‌లో గ్రంథాలయం ఏర్పాటు చేస్తాం. సింగరేణి స్థలంలో నివాసం ఉన్నవారి ఇళ్ల పట్టాలు ఇప్పించేలా చర్యలు తీసుకుంటా. సోలార్ వీధిదీపాలు, సెంట్రల్ లైటింగ్. ప్రతి 6నెలలకు ఒకసారి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని పేర్కొ న్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలందరికి అందేలా చర్యలు తీసుకుంటాం. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం.



# అభివృద్ధికి ఆమడ దూరంలో 28వ వార్డు



## గత పాలకుల నిర్లక్ష్యానికి కాలనీ వాసుల అవస్థలు

## వార్డు అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తా...

## ప్రత్యేక ప్రణాళికతో ఎన్నికల బరిలో ఒగ్గు రమేష్..

జమ్మికుంట, ఫిబ్రవరి 7 (నినాదం)

గత పాలకుల నిర్లక్ష్యానికి వారి స్వార్ధ రాజకీయాలకు 28 వార్డు ప్రజలు అభివృద్ధికి నోచుకోలేదని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి ఒగ్గు రమేష్ అన్నారు. శనివారం నినాదంతో మాట్లాడుతూ, పది సంవత్సరాలు అధికారంలో ఉన్న గత పాలకవర్గం 28వ వార్డు అభివృద్ధి విషయంలో సవతి తల్లి ప్రేమ చూపెట్టిందని వారికి అనుకూలంగా ఉన్నవారికి అన్నీ చేశారని కాలనీ అభివృద్ధిని మాత్రం విస్మరించారని రమేష్ ఆరోపించారు. వార్డు ప్రజలు నమ్మకంతో గెలిపిస్తే వారి ఆశలను ఆశయాలను పక్కనపెట్టి వారి స్వార్థ రాజకీయం కోసం గత పాలకులు పనిచేశారని రమేష్ తెలిపారు.

### అసంపూర్ణ డ్రైనేజీలు అధ్వాన్నంగా సిసి రోడ్లు..

28 వ వార్డు అభివృద్ధి విషయంలో వెనుకబడి ఉందని తనను కాలనీవాసులు తమ అమూల్యమైన ఓటు చెయ్యి గుర్తుపై వేసి భారీ మెజార్టీతో గెలిపిస్తే ప్రత్యేక ప్రణాళికతో వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని రమేష్ అన్నారు. 10 సంవత్సరాలలో చేయని అభివృద్ధిని తాను కౌన్సిలర్ గా గెలిచిన సంవత్సరంలోపు కాలనీలోని సిసి రోడ్లు డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా ఆధునికరిస్తూ సేవలు అందిస్తానని రమేష్ తెలిపారు.


### సేవ చేయడానికి రాజకీయాల్లోకి..

గత పది సంవత్సరాలుగా 28వ వార్డులో జరుగుతున్న అవినీతి రాజకీయాలను చూసి తట్టుకోలేక రాజకీయాల్లోకి వస్తున్నానని రాజకీయం చేయడం తనకు నచ్చదని కేవలం సేవ చేయడానికి మాత్రమే కౌన్సిలర్ గా బరిలో ఉంటున్నానని రమేష్ పేర్కొన్నారు. డబ్బు సంపాదించాలన్న ఆలోచన లేదని నాయకుడిగా గెలిస్తే సేవకుడిగా పని చేస్తానని ప్రత్యేక ప్రణాళికతో ప్రజల ముందుకు వస్తున్నానని వార్డు ప్రజలు ఆలోచించి తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు.

### సంక్షేమ పథకాలను చూసి ఓటు వేయండి..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అందిస్తున్న సంక్షేమ పథకాలను చూసి ప్రజలు ఓటు వేయాలని రమేష్ తెలిపారు, ప్రతిరోజు నిరుపేదలకు సన్న బియ్యం అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. గత పది సంవత్సరాలలో కనీసం రేషన్ కార్డు కూడా ఇవ్వలేని గత పాలకుల నిర్లక్ష్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి నూతన రేషన్ కార్డులతో పాటు మరెన్నో సంక్షేమ పథకాలను ప్రజలకు అందించిన గొప్ప పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు.

సంక్షేమ పథకాలు కొనసాగాలన్న పేదలకు న్యాయం జరగాలన్న అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆయన తెలిపారు. వార్డులో ప్రచారం చేస్తున్నప్పుడు తమ ఓటు కాంగ్రెస్ పార్టీకి వేస్తామని అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ప్రజలు విశ్వసిస్తూ తమను ఆశీర్వదించడం సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. తను అధికారంలోకి రాగానే వార్డులో సీసీ రోడ్ల నిర్మాణం డ్రైనేజీ వ్యవస్థ మహిళల కోసం మహిళా సంఘ భవనం వార్డు సభ్యుల కోరిక మేరకు నూతన దేవాలయం నిర్మాణానికి కృషి చేస్తానని రమేష్ అన్నారు.



# ప్రజాసేవే లక్ష్యంగా రాజకీయాల్లోకి రాగ రవళి

## 24వ వార్డులో సింహం గుర్తుపై విస్తృత ప్రచారం



జమ్మికుంట, ఫిబ్రవరి 6 (నినాదం): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 24వ వార్డులో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా సింహం గుర్తుపై పోటీ చేస్తున్న రాగ రవళి ఎన్నికల ప్రచారాన్ని వేగంగా కొనసాగిస్తున్నారు. శనివారం ఆమె వార్డు ప్రజలతో కలిసి గడపగడపకు ప్రచారం నిర్వహించి, విస్తృతంగా ఓటర్లను కలిశారు.



బీటెక్ పూర్తి చేసిన రాగ రవళి ప్రజాసేవే ధ్యేయంగా రాజకీయాల్లోకి వచ్చినట్లు తెలిపారు. రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు మద్దూరి రాజనర్సు కుమార్తెగా ప్రజల సమస్యలను దగ్గరగా తెలుసుకొని పరిష్కరించాలనే లక్ష్యంతో బరిలోకి దిగినట్లు పేర్కొన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా 24వ వార్డు అభివృద్ధికి వెనుకబడిందని, తనకు ఒక్క అవకాశం ఇస్తే స్పష్టమైన కార్యాచరణతో వార్డును అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

### మౌలిక సదుపాయాల అభివృద్ధే తొలి ప్రాధాన్యం

మున్సిపల్ కౌన్సిలర్‌గా గెలిచిన వెంటనే వార్డులోని మౌలిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తానని రవళి తెలిపారు. కాలనీల్లో సైడ్ డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా అభివృద్ధి చేయడంతో పాటు వీధిదీపాల ఏర్పాటు, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని చెప్పారు. ప్రతి గల్లీలో సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామని, ప్రజల అభిప్రాయం మేరకు వినాయక మండపం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

### ఆధ్యాత్మిక అభివృద్ధికీ ప్రత్యేక శ్రద్ధ

వార్డు ప్రజల సంక్షేమం కోసం 24వ వార్డులో పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణం చేపడతామని, ఆంజనేయస్వామి ఆలయంలో నవగ్రహాలు, ధ్వజస్తంభం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆలయాల్లో నిత్య పూజల కోసం పూజారిని నియమించి, దీప–దూప–నైవేద్యాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సింహం గుర్తుపై పోటీ చేస్తున్న తనకు అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని రాగ రవళి వార్డు ప్రజలను కోరారు. నాగపూర్ విజయ్, నాగపురి రాజు గౌడ్‌ల సారథ్యంలో సాగుతున్న ప్రచారం తనకు మరింత బలాన్నిస్తోందని, వార్డు ప్రజల సహకారం అమూల్యమని ఆమె పేర్కొన్నారు



NINADAM CINEMA

# 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని'

## ట్రైలర్ లాంచ్‌లో పాల్గొన్న అనిల్ రావిపూడి

**శివాజీ - లయ ప్రధానపాత్రలో నటించిన చిత్రం 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' సుధీర్ శ్రీరామ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఫిబ్రవరి 12 నుంచి ఈటీవీ విన్ వేదికగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు.**



అనిల్ రావిపూడి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నా సినిమాలో హీరోలే నాకు దేవుళ్లు. వాళ్లను అలానే చూస్తాను. ఈ సినిమాలో లయ కొత్తగా కనిపించనున్నారు. శివాజీ సినిమాను ఎంత ప్రేమిస్తారో అందరికీ తెలిసిందే. 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' అందరినీ నవ్విస్తుంది. ఈ ఈవెంట్‌కు పిలవడం కోసం శివాజీ ఫోన్ చేసినప్పుడు ఒక మాట చెప్పాడు. 'ఈసారి జాగ్రత్తగా మట్లాడతాను' అని చెప్పారు. కచ్చితంగా వస్తానన్నాను' అని అనిల్ రావిపూడి అన్నారు. ఈ సినిమా నవ్విస్తుందా.. భయపెడుతుందా? అనగా.. నవ్విస్తూ.. భయపెడుతుంది. చివరి వరకూ ఉత్కంఠ ఉంటుందని శివాజీ అన్నాడు. 50ఏళ్ల పూర్తవుతున్న సందర్భంగా నిర్మాతగా మారే అవకాశాలు ఏమైనా ఉన్నాయా? అంటే.. అనిల్ రావిపూడి హీరోగా చేస్తే.. నేను నిర్మాతను అవుతా. ఎందుకంటే అనిల్ మల్టీటాలెంటెడ్ అని కితాబునిచ్చారు. నా కెరీర్ పూర్తయిందని అనుకున్నాను. ఆ సమయంలో ఓటీటీ వచ్చింది. అలా మరోసారి నా కెరీర్ ఊపందుకుంది. నా 30 ఏళ్ల కెరీర్‌లో నేను నటించిన అన్ని సినిమాలు హిట్ అయ్యాయి. 99 శాతం విజయం సాధించాయని శివాజీ అన్నాడు.

# కానేకాదు పోరు... మంత్రి లక్ష్మణ్‌దే జోరు

## మూడు దశాబ్దాలపైగా కాంగ్రెస్‌తో బంధం

## గతంలో ఎంపీటీసీగా శభాష్ అనిపించిన సేవలు



- నాటి ఆయన రోడ్లు.. పనితీరుకు గురుతులు
- 13వవార్డు కౌన్సిలర్‌గా మరోసారి ప్రజల్లోకి
- ప్రత్యర్ధులకు ఇక చుక్కలేనంటున్న జనం



చెన్నూర్,ఫిబ్రవరి 07(నినాదం): పనితనం ఉంటే దశాబ్దాలు దాటినా ఆ ప్రజాప్రతినిధిని ప్రజలు మరువరేదానికి చెన్నూరుకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత మంత్రి లక్ష్మణ్ తార్కానంగా నిలిచారు. ఎంపీటీసీగా స్థానిక ఓ ప్రాంతానికి ఒక్కసారి అందించిన సేవలు ఆయనకు కొండంత ప్రజాకుటుంబాన్ని అందించాయి. ప్రస్తుత 13 వ వార్డు కౌన్సిలర్ గా మరోసారి స్వాగతం పలుకుతున్నాయి.

### ప్రజల్లోతరగని మమత.. సాటిలేని నేత

సిన్సియర్ కాంగ్రెస్ కార్యకర్తగా గడిచిన 35 ఏళ్ల కాలంలో మంత్రి లక్ష్మణ్ అటు పార్టీలో ప్రజాప్రతినిధిగా ప్రజల్లో ఎన్నటికీ తరగని మమతానురా గాలను సంపాదించుకున్నారు. అవే ప్రస్తుతం ఆయన్ని సరైన పోటీయే లేని కౌన్సిలర్ అభ్యర్థిగా నిలిపాయి.

ఎవరి పిలుపుకైనా చిరునవ్వుతో స్పందించే వ్యక్తిగా గుర్తింపు తెచ్చిపెట్టాయి. చెన్నూరు మున్సిపాలిటీ 13 వ వార్డు కౌన్సిలర్ గా ఆయన నిర్వహిస్తున్న ప్రచారంలో వార్డుప్రజలు తమ పూర్తిమద్దతు లక్ష్మణ్ కే తెలుపుతున్నారు. కాగాగతంలో ఆయన చేసిన పనులే పై సత్పరి ణామాలకు మూలం అయ్యాయని స్థానికులు చెబుతున్నారు. అంతిమంగా వార్డులో వార్ వన్ సైడేనని లక్ష్మణ్ గెలుపును ప్రజలు ఇప్పుడే ప్రకటించేస్తున్నారు.



Printed, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrial Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL : +91 83330 68787